FOR ADS.......
ఆకాంక్ష
CONTACT:
8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 182 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ ఆదివారం- 22 - ఫిబ్రవరి - 2026

## పవన్ కల్యాణ్ చొరవతో కొణిదెల గ్రామానికి మహర్దశ



రూ. 50 లక్షల విరాళంతో 90,000 లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం

వివిధ పథకాల ద్వారా గ్రామానికి రూ. 6 కోట్లకు పైగా నిధులు

ఎన్నికల ముందు ఇచ్చిన దత్తత హామీని నెరవేరుస్తున్న పవన్

రోడ్లు, డ్రైన్లు, ఇళ్ల నిర్మాణంతో గ్రామ రూపురేఖల మార్పు

అమరావతి : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామ రూపురేఖలు మారుతున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామాభివృద్ధికి నడుం బిగించిన పవన్, తన వ్యక్తిగత విరాళంతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించారు. ఆయన అందించిన రూ. 50 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా గ్రామస్థుల దశాబ్దాల తాగునీటి కష్టాలు తీరనున్నాయి. మిగతా..2లో

## ఏఐ సమ్మిట్ వద్ద యూత్ కాంగ్రెస్ నిరసనలపై కేటీఆర్ స్పందన



అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడంపై కేటీఆర్ మండిపాటు

ఇది దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని వ్యాఖ్య

ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని సూచన

హైదరాబాద్ ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026 వేదిక వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన నిరసనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని అభివర్ణించారు. అంతర్జాతీయ సదస్సులు దేశ ప్రతిభను, సామర్థ్యాన్ని ప్రపంచానికి మిగతా..2లో

## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది




- ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ ఆందోళనపై మంత్రి లోకేశ్ ఆగ్రహం
- దేశ ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యవహరించారని తీవ్ర విమర్శ
- ప్రతిష్ఠాత్మక వేదికలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్న లోకేశ్
- ఆవిష్కరణలపై దృష్టిపెట్టి దేశాన్ని నిర్మించుకోవాలని పిలుపు

## ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన
# అగ్రి షోను సందర్శించిన హరీశ్ రావు

తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్

రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్



హైదరాబాద్: రైతుబడి అగ్రి షో వంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తే రైతులకు మేలు జరుగుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని అన్నారు. సాగు పనిముట్లకు రాయితీపై రైతుల పక్షాన అసెంబ్లీలో చర్చిస్తామని హరీశ్ రావు వెల్లడించారు. అగ్రి వంటి కార్యక్రమాలు రైతులకు అన్ని రకాలుగా దోహదపడుతాయని అన్నారు. ఈ అగ్రి షో కార్యక్రమంలో రైతుబడికి చెందిన రాజేందర్ రెడ్డి మాజీ మంత్రి హరీశ్ రావుపై ప్రశంసలు కురిపించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో స్వయంగా తనకు ఫోన్ చేసి సాగర్‌లో స్థానిక పరిపాలన లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, దీని మీద వార్తలు రాస్తే దాని ఆధారంగా చర్యలు తీసుకుంటానని తనకు చెప్పారని గుర్తుచేసుకున్నారు. అప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద పాలన ఉండేదని అన్నారు.

## ఈ నెల 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు..
## నాదెండ్ల మనోహర్ కీలక సూచనలు

పార్టీ నేతలతో నాదెండ్ల మనోహర్ టెలీకన్ఫరెన్స్


క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచన

జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలన్న నాదెండ్ల



అమరావతి : జనసేన పార్టీ బలోపేతం దిశగా ఆ పార్టీ మరో కీలక అడుగు వేస్తోంది. జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 26న ప్రారంభం కానుంది. ఈ ప్రణాళికపై పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన జనసేన అగ్రనేత, మంత్రి నాదెండ్ల మనోహర్... క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెండు వారాల సమయాన్ని వినియోగించుకుని సమష్టిగా భారీగా సభ్యత్వాలను చేయించేలా లక్ష్యాలు పెట్టుకోవాలని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించనున్నట్టు తెలిపారు. మిగతా..2లో

## కశ్మీర్, పంజాబ్ లో IEDలు గుర్తింపు
## ఉగ్రముప్పు వేళ భద్రత కట్టుదిట్టం!




- దిల్లీకి ఉగ్రముప్పు- లష్కరేతోయిబా ఐఈడీ దాడులకు ప్లాన్ చేసినట్లు నిఘా వర్గాలు వెల్లడి

ఢిల్లి : దేశ రాజధాని దిల్లీలో ఉగ్రదాడులకు లష్కరేతోయిబా కుట్ర చేసిందన్న నిఘావర్గాల హెచ్చరికల వేళ పంజాబ్, జమ్ముకశ్మీర్‌లలో రెండు ఐఈడీలను గుర్తించడం తీవ్ర కలకలం రేపింది. అమృత్‌సర్‌లోని రయ్యా పోలీస్ పోస్టు సమీపంలో ఓ అనుమానాస్పద బ్యాగ్‌ను గుర్తించిన పోలీసులు అందులో తనిఖీ చేయగా ఐఈడీ కనిపించింది. వెంటనే బాంబు నిర్వీర్య బృందాలను రప్పించిన పోలీసులు ఐఈడీని డిఫ్యూజ్ చేయించారు.

## మోదీ చేసిన ద్రోహం బయటపడింది
## ఆయన పూర్తిగా సరెండర్ అయిపోయారు

- మోదీ సర్కార్ ది 'క్లూలెస్ విదేశాంగ విధానం
- ఆయన ఏకపక్షంగా లొంగిపోయారు




ఢిల్లి : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన గ్లోబల్ టారిఫ్ లను యూఎస్ సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మోదీపై విరుచుకుపడ్డారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో, మోదీ దేశానికి చేసిన ద్రోహం బయటపడిందని వ్యాఖ్యానించారు. భారత్ -యూఎస్ డీల్ విషయంలో మోదీ పూర్తిగా రాజీపడ్డారని ఆరోపించారు. మరోవైపు, ప్రధాని మోదీ తన ఇమేజ్ ను కాపాడుకునే ఆరాటంలో మన దేశాన్ని అమెరికాకు అప్పగించారని కాంగ్రెస్ విమర్శించింది."ప్రధాని మోదీ రాజీ పడ్డారు. ఆయన చేసిన ద్రోహం ఇప్పుడు బయటపడింది. ఆయన తిరిగి చర్చలు జరపలేరు. ఒకవేళ చేసినా ఆయన మళ్లీ లొంగిపోతారు."

**రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత ఎక్స్ పోస్ట్ ఏకపక్షంగా లొంగిపోయారు!**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ సర్కార్ పై శనివారం విమర్శలు గుప్పించారు. భారత్ -యూఎస్ ట్రేడ్ డీల్ అనేది మోదీ ప్రభుత్వం 'దిక్కుతోచని విదేశాంగ విధానమా?', లేదా అమెరికా ముందు 'ఏకపక్షంగా లొంగిపోవడమా?' అని ప్రశ్నించారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు వెలువడే వరకు వేచి చూడకుండా, మోదీ ప్రభుత్వం ఎందుకు అంత హడావుడిగా ఈ 'ట్రాప్ డీల్ 'లోకి దూకిందని,

## భారత్-బ్రెజిల్ కలిస్తే గ్లోబల్ సౌత్
# మరింత బలోపేతం

- భారత్ పర్యటనలో బ్రెజిల్ అధ్యక్షుడు లులా ద సిల్వా
- రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం
- గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో పాల్గొన్న లులాకు మోదీ కృతజ్ఞతలు




ఢల్లి : అంతర్జాతీయ వేదికపై భారత్, బ్రెజిల్ దేశాలు కలిసి పనిచేస్తే 'గ్లోబల్ సౌత్' స్వరం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్, బ్రెజిల్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రానున్న రోజుల్లో భారీగా పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఈ వాణిజ్యాన్ని ఏకంగా 20 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. భారత పర్యటనలో ఉన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా ద సిల్వాతో ప్రధాని మోదీ శనివారం దిల్లీ సమావేశమయ్యారు. ఇరువురి నేతల మధ్య కీలక ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. భవిష్యత్ కోసం డిజిటల్ పార్ట్‌నర్‌షిప్, రేర్‌ఎర్త్ అండ్ క్రిటికల్ మినరల్స్, స్టీల్ సరఫరా గొలుసులో మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారానికి సంబంధించి మూడు ఒప్పందాలపై వారిద్దరు సంతకాలు చేశారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్త విలేకరుల సమావేశంలో

## అమెరికాతో ఒప్పందాల వల్ల
## మన రైతులకు నష్టం




- కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులంతా తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు..

హైదరాబాద్, ఫిబ్రవరి 21 : కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులు తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అమెరికాలో సాగవుతున్న జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను భారతదేశంలోకి ఎలాంటి టాక్స్ లేకుండా అనుమతించడం వల్ల

## పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని
# తెలిపిన రేవంత్ రెడ్డి

- నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానన్న ముఖ్యమంత్రి
- అందరి కృషి వల్ల తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదన్న ముఖ్యమంత్రి




హైదరాబాద్: తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలో కూడా కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని, నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానని గుర్తుచేసుకున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో లేదని వెల్లడించారు. మనలో మనం కొట్టుకుంటే పార్టీలో కష్టపడి పనిచేసే లక్షలాది మంది కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. అందరి కృషి వల్లే తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదని అన్నారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, ఎమ్మెల్యే టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన మరో అరవై మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని

## కాటిపల్లి ఇంటిపై కాంగ్రెస్ గూండాయిజం చేసింది..
## రేవంత్ సమాధానం చెప్పాలి

- ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారన్న ఎంపీ
- సామాన్యులకు రక్షణ ఎలా ఇస్తుందో ముఖ్యమంత్రి చెప్పాలని నిలదీత
- కామారెడ్డిలో రేవంత్ రెడ్డిని కాటిపల్లి ఓడించడం కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని వ్యాఖ్య




హైదరాబాద్: కామారెడ్డి బీజేపీ శాసనసభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఖండించారు. మిగతా..2లో

## మొదటి పేజి తరువాయి

## ఈ నెల 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు..

# నాదెండ్ల మనోహర్ కీలక సూచనలు

క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి స్పష్టమైన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. స్థానిక సమస్యల పరిష్కారంలో చొరవ చూపితే పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలని... కొత్త సభ్యుల చేరికపై దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో 12.6 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని... ఈసారి రెట్టింపు సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు.

# కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది

అమరావతి : ఢిల్లీలో నిన్న "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026"లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సృష్టించిన గందరగోళంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం, విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై వారి ప్రవర్తన దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఏఐ రంగంలో ఎదుగుతున్న భారత్ శక్తిని ప్రపంచానికి చాటేందుకు ఉద్దేశించిన సదస్సులో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు లోకేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఏఐ సూపర్ పవర్‌గా భారత్ ఎదుగుతున్న తీరును ప్రదర్శించేందుకు ఈ సదస్సు ఒక గొప్ప అవకాశం. అలాంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చడం ద్వారా ప్రపంచం ముందు మనందరి ప్రతిష్ఠను తగ్గించారు. ఇది దిగ్భ్రాంతికరం, విచారకరం" అని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం ఇంతకంటే మెరుగైన గౌరవానికి అర్హమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. "మనం ఇలాంటి చిల్లర రాజకీయాలను పక్కనపెట్టి, ఆవిష్కరణలు, నైపుణ్యం ద్వారా దేశ నిర్మాణానికి ప్రాధాన్యత ఇద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు. దేశ ప్రతిష్ఠకు సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.

## కశ్మీర్, పంజాబ్ లో IEDలు గుర్తింపు

# ఉగ్రముప్పు వేళ భద్రత కట్టుదిట్టం!

కశ్మీర్‌లోని సఫపొరా ప్రాంతంలో ఓ రోడ్డు పక్కన పారవేసిన బ్యాగ్‌ను తనిఖీ చేయగా ఇంప్రవైజ్డ్ పేలుడు పరికరం లభ్యమైందని పోలీసులు తెలిపారు. వెంటనే అక్కడకు చేరుకున్న బాంబ్ స్క్వాడ్ బృందం దాన్ని నిర్వీర్యం చేసిందని వెల్లడించారు. కాగా జమ్మూకశ్మీర్‌లో ఈ వారంలో ఐఈడీలను గుర్తించడం ఇది మూడోసారి. ఈ ఐఈడీలకు దిల్లీలో ఉగ్రదాడి కుట్రలకు లింకులు లేవని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు.

### ఎర్రకోట, చాందినీ చౌక్ లే టార్గెట్ !

దిల్లీలో లష్కరే తోయిబా ఉగ్రవాదులు ఐఈడీ (ఇంప్రొవైజ్డ్ ఎక్స్ ప్లోజివ్ డివైస్ )తో దాడులు చేసేందుకు కుట్ర పన్నారని నిఘా వర్గాలు సమాచారం అందించాయి. ముఖ్యంగా ఎర్రకోట పరిసర ప్రాంతాలు, చాందినీ చౌక్ లోని ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా దాడులు చేసే అవకాశం ఉందని తెలిపాయి. అంతేకాదు దిల్లీతోపాటు దేశంలోని ఇతర నగరాల్లోని ప్రముఖ దేవాలయాలపై కూడా దాడులు జరిగే అవకాశం ఉందని హెచ్చరించాయి. దీనితో దిల్లీ పోలీసులు, భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఇప్పటికే ఎర్రకోట, చాందినీ చౌక్ ప్రాంతాల్లో పారామిలటరీ బలగాలను మోహరించారు. సీసీటీవీ కెమెరాలు, బాంబు డిటెక్షన్ స్క్వాడ్ లు, డాగ్ స్క్వాడ్ లతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతీకార దాడికి యత్నం! 2026 ఫిబ్రవరి 6న పాకిస్థాన్ లోని ఇస్లామాబాద్ లో ఒక మసీదులో భారీ పేలుడు జరిగింది. ఈ ఘటనలో 31 మంది మరణించారు. దీనికి ప్రతీకారంగా లష్కరే తోయిబా ఈ దాడులకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఆ దాడులకు తామే బాధ్యులమని ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్ఐఎస్) ప్రకటించినప్పటికీ, లష్కరే తోయిబా భారత్ ను లక్ష్యంగా చేసుకుంటుండడం గమనార్హం.

## పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత

# ఎదుర్కొన్నానని తెలిపిన రేవంత్ రెడ్డి

పార్టీలో అందరి పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కోసం శ్రమించే వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. మెరిట్ ప్రకారమే పార్టీలో అవకాశాలు వస్తాయన్నారు. డీసీసీ పదవి ఎంతో విలువైనదని, దీనిని ఏమాత్రం దుర్వినియోగం చేసుకోవద్దని హితవు పలికారు. మంచి ప్రతిభ కనబరిస్తే ఆ తర్వాత ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి కూడా కావొచ్చని అన్నారు. నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం వేల కోట్ల రూపాయలను ఆ రోజుల్లోనే త్యాగం చేశారని, జవహర్ లాల్ నెహ్రూ జైల్లో ఉన్నారని తెలిపారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని తెలిపారు.

# అమెరికాతో ఒప్పందాల వల్ల మన రైతులకు నష్టం

మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న రైతులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు ప్రమాదంలో పడతారని తెలిపారు. మన దేశంలో కూడా అన్నదాతలు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి పంటలని ఎక్కువగా పండిస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. అమెరికా దేశం నుంచి ఈ పంటలను దిగుమతి చేసుకోవడం వల్ల తెలంగాణలో ఉన్న రైతులంతా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతులకు సంబంధించిన ఓ కార్యక్రమానికి హరీశ్‌రావు ఇవాళ (శనివారం) హాజరయ్యారు. వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

### రైతు భరోసా రావడం లేదు..

గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కేవలం 12 గంటల పాటే విద్యుత్ సరఫరా ఇస్తున్నారని, ఎరువులు సకాలంలో అందడం లేదని చెప్పుకొచ్చారు. అన్నదాతల సమస్యలను త్వరలో జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసే రైతులకు వ్యవసాయ పనిముట్లు, డ్రోన్లు, ట్రాక్టర్లు సబ్సిడీకి ఇచ్చే విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## కాటిపల్లి ఇంటిపై కాంగ్రెస్ గూండాయిజం చేసింది..

# రేవంత్ సమాధానం చెప్పాలి

వెంకటరమణారెడ్డికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఎమ్మెల్యే నివాసంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిపై స్పందించారు. ఒక ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ పార్టీ దాడి చేసి గూండాయిజం చేస్తోందని ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. ఇలాంటి ప్రభుత్వం ఇక సామాన్య ప్రజలకు ఏం రక్షణ ఇస్తుందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇలాంటి దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించరని, హింసను క్షమించరని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఓడించారని, ఆ తర్వాత అక్కడ బీజేపీ క్రమంగా మరింత బలపడుతోందని, దీనిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ శ్రేణులు దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అల్లర్లకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ దాడికి రేవంత్ రెడ్డిదే బాధ్యత అన్నారు. కాటిపల్లి వెంకటరమణారెడ్డికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని పేర్కొన్నారు.

## ఏఐ సమ్మిట్ వద్ద యూత్ కాంగ్రెస్

# నిరసనలపై కేటీఆర్ స్పందన



చూపించే వేదికలని అన్నారు. ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని చెప్పారు. రాజకీయ విభేదాలు సహజమే అయినా... అభిప్రాయ భేదాలను వ్యక్తపరచడానికి సరైన సమయం, సరైన వేదిక ఉండాలని కేటీఆర్ అన్నారు. గ్లోబల్ ఈవెంట్‌లలో ఇలాంటి నిరసనలు చేపట్టడం వల్ల భారత్‌పై అంతర్జాతీయంగా ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందని విమర్శించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన చేయడం చాలా విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు.


# పేదలకు అండగా ఉంటాం - ఆదాయం పెంచి ఆనందం పంచుతాం

## మొదటి పేజి తరువాయి

ప్రజలకు ఆదాయం వస్తుందని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. స్వచ్ఛరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను అందజేశారు. ప్రజావేదిక వద్ద స్టాళ్లను పరిశీలించారు. " వినుకొండలో పీహెచ్‌సీని వందపడకల ఆస్పత్రిగా మారుస్తున్నాం. డయాలసిస్, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. వినుకొండలో పచ్చదనం పెంచేందుకు నిధులు కేటాయిస్తాం. పశువైద్య కళాశాల, అగ్రికల్చరల్ కాలేజ్ ఏర్పాటు చేస్తాం. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని 2025 జనవరిలో ప్రారంభించాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగుతున్నాయి. పచ్చదనం-పరిశుభ్రత, నీరు-మీరుతో ప్రజల వద్దకు వస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం. నేను సీఎంగా వచ్చేనాటికి 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. దానిని క్రమా తొలగిస్తున్నాం. వర్షాలు పడినప్పుడు భూ జలాలు కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది. కలుషిత నీళ్లు తాగితే డయేరియా వంటి అనేక సమస్యలు వస్తాయి. ప్రజలకు స్వచ్ఛమైన నీరు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టాం" అని చంద్రబాబు తెలిపారు.

### గ్రామీణ ప్రాంతాల్లో మార్చి 31 నాటికి చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిది: సీఎం చంద్రబాబు

ఎక్కడ ఉన్నా కార్యక్రమానికి హాజరువుతున్నా : "ప్రతి నెల మూడో శనివారం ఎక్కడ ఉన్నా కార్యక్రమానికి హాజరువుతున్నా.




మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను వంద శాతం సేకరిస్తున్నారు. మార్చి 31 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోనూ చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిది. రాబోయే రోజుల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తుంది. ఇప్పటికే 'సూపర్ సిక్స్' హిట్ అయ్యింది. 'పేదల సేవలో' కార్యక్రమం కింద మొదటి తేదీనే ఇంటింటికి వస్తున్నాం. ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తున్నాం. ప్రతి ఎకరాకు నీళ్లిస్తున్నాం. గిట్టుబాటు వచ్చే పంటలు వేయిస్తున్నాం. రైతులకు టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. అగ్రికల్చర్ నిపుణులను అందుబాటులో ఉంచుతున్నాం. రైతులు సైతం టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారు. మైక్రో ఇరిగేషన్, బిందుసేద్యం తదితర కార్యక్రమాలను నేనే ప్రారంభించా. వారసత్వంగా వచ్చే పంటలే పండిస్తే ఆదాయం లేకుండా ఇబ్బందులు వస్తున్నాయి. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో రూ.5కే భోజనం పెడుతున్నాం. మెరుగైన జీవన ప్రమాణాల కోసం పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. ఆదాయం పెంచే మార్గాలను నేర్పించి వారిని ఆదుకుంటున్నాం" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. "రైతులంతా టెక్నాలజీ అందిపుచ్చుకుంటున్నారు. మైక్రో ఇరిగేషన్, బిందుసేద్యాన్ని నేనే ప్రారంభించా. వారసత్వ పంటల వల్ల ఆదాయం తగ్గిపోయి ఇబ్బందులు వస్తున్నాయి. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టాలనే ఉద్దేశంతోనే రూ.5కు భోజనం ప్రారంభించాం. స్త్రీ శక్తి కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాం. సంక్షేమ కార్యక్రమాలతో పేదలకు అండగా ఉంటున్నాం. పేదల ఆదాయం పెంచి వారి జీవితాల్లో ఆనందం పంచుతాం. మెరుగైన జీవన ప్రమాణాల కోసం పీ4 కార్యక్రమం తెచ్చాం. ఆదాయం పెంచే మార్గాలను నేర్పించి వారిని ఆదుకుంటున్నాం." - సీఎం చంద్రబాబు "కొత్త విషయాలు నేర్చుకునేందుకు ముందుంటా. ఆదాయానికి చిరునామాగా మన రాష్ట్రం ఉండాలి. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారనేది ప్రజలు గమనించాలి. దిల్లీలో జరిగిన ఏఐ సమిట్‌కు కాంగ్రెస్ వాళ్లు ఆటంకం కలిగించారు. నిన్న దిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల వైఖరి చూసి చాలా బాధపడ్డా. దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలి" అని చంద్రబాబు అన్నారు. మీ పొలాల వద్దకు సాంకేతికత : "ప్రపంచంలో ఉన్న సాంకేతికతను మీ పొలాల వద్దకు తీసుకొస్తున్నాం. దిల్లీలో జరిగిన ఏఐ సదస్సులో 60 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారనేది ప్రజలు గమనించాలి. అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నాం. ప్రజలకు మేలు చేసేందుకే ప్రతి క్షణం ఆలోచిస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చాక వచ్చిన మార్పులు గమనించాలి. రోడ్లపై గుంతలు పూడుస్తున్నాం, కొత్తవి వేస్తున్నాం. ఏడుకొండలవాడికి అపచారం చేసే స్థాయికి వచ్చారు. ఇప్పుడు మళ్లీ ప్రతిచోటా ప్రజలను రెచ్చగొడుతున్నారు. డ్రగ్స్ మత్తులో ఆడబిడ్డల జోలికొస్తే వారికదే చివరిరోజు అవుతుంది. నేను జైలుకు వెళ్లాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడేందుకే జైలుకు వెళ్లా. నేరగాళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచాలి. వేంకటేశ్వరస్వామి ఫొటోలను మండలికి తీసుకెళ్లారంటే ఏమనాలి? రాష్ట్రంలో పెనుమార్పులు తెచ్చేందుకు కృషి చేస్తున్నా. మన యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని అనుకుంటున్నా. ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని భావిస్తున్నా" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# మోదీ చేసిన ద్రోహం బయటపడింది- ఆయన పూర్తిగా సరెండర్ అయిపోయారు

## మొదటి పేజి తరువాయి

ఎక్స్ వేదికగా ఖర్గే ప్రశ్నించారు. ఈ ట్రేడ్ డీల్ వల్ల భారత్ భారీగా రాయితీలు కోల్పోయిందని ఆయన ఆరోపించారు. "ఈ వాణిజ్య ఒప్పందం ద్వారా అమెరికన్ ఉత్పత్తులపై సున్నా సుంకాలు విధించారు. తద్వారా భారత వ్యవసాయ మార్కెట్ ను అమెరికా వస్తువుల కోసం తెరిచారు. అంతేకాదు, వచ్చే ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్ల విలువైన యూఎస్ వస్తువులను దిగుమతి చేసుకునే ప్రణాళిక మన దేశ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తాయి. ఇక రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయాలనే నిబంధన వల్ల భారత ఇంధన భద్రతను దెబ్బతీస్తుంది" అని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. డిజిటల్ రంగంలో అమెరికాకు అనేక పన్ను రాయితీలు కల్పించడాన్ని ఆయన తప్పుపట్టారు. "భారత జాతీయ ప్రయోజనాలను, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని పణంగా పెట్టమని మీపై ఎవరు ఒత్తిడి తెచ్చారు? అది ఎప్ స్టీన్ ఫైల్స్ ప్రభావమా?" అని మల్లికార్జున ఖర్గే నిలదీశారు. 140 కోట్ల భారతీయుల ఆత్మగౌరవాన్ని, రైతులు, కార్మికులు, చిన్న



వ్యాపారుల ప్రయోజనాలకు కాపాడే విధంగా న్యాయపరమైన వాణిజ్య ఒప్పందాన్ని ప్రభుత్వం కుదుర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

### కాస్త వేచి ఉండాల్సింది!

"మోదీ తన బలహీనమైన ప్రతిష్ఠను కాపాడుకోవడానికి తొందరపడకుండా, మరో 18 రోజులు వేచి ఉండాల్సింది. అప్పుడు భారత రైతులు ఈ బాధల నుంచి తప్పించుకునేవారు" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. అంతేకాదు ఆయన పలు ప్రశ్నలు కూడా సంధించారు.

# భారత్-బ్రెజిల్ కలిస్తే గ్లోబల్ సౌత్ మరింత బలోపేతం

## మొదటి పేజి తరువాయి

మాట్లాడారు. లులా ద సిల్వా రాక పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. "అధ్యక్షుడు లులాకు, ఆయనతో వచ్చిన ప్రతినిధుల బృందానికి స్వాగతం పలకడం చాలా ఆనందంగా ఉంది" అని మోదీ అన్నారు. లులా దార్శనికత, నాయకత్వంలో ఇరు దేశాల సంబంధాలు ఎంతో బలపడ్డాయని కొనియాడారు. గత కొన్నేళ్లలో లులాను తాను పలుమార్లు కలిశానని మోదీ గుర్తు చేసుకున్నారు. ప్రతి కలయికలోనూ భారత్‌పై ఆయనకు ఉన్న నమ్మకం, గొప్ప స్నేహభావం తనకు కనిపించాయన్నారు. ప్రస్తుతం భారత్‌లో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న 'గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో లులా పాల్గొన్నారు. దీనిపై ప్రధాని మోదీ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. లులా పర్యటన ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త శక్తిని ఇచ్చిందని మోదీ వ్యాఖ్యానించారు.

టెక్నాలజీ అనుసంధానం

లాటిన్ అమెరికా దేశాల్లో భారత్‌కు బ్రెజిల్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ఈ విషయాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాబోయే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ డాలర్లకు పెంచాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఈ వాణిజ్యం కేవలం ఒక అంకె మాత్రమే కాదని ఆయన అన్నారు. ఇది రెండు దేశాల మధ్య ఉన్న నమ్మకానికి, మైత్రికి ప్రతీక అని అభివర్ణించారు. బ్రెజిల్‌లో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ఏర్పాటు చేయనున్నారు. దీనిపై భారత్ ఎంతో ఉత్సాహంగా, చురుగ్గా పనిచేస్తోందని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. దీనితో పాటు మరికొన్ని కీలక ఆధునిక రంగాలపై ఇరు దేశాలు దృష్టి పెట్టాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సూపర్ కంప్యూటర్లు, సెమీకండక్టర్లు, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీల్లో సహకారాన్ని మరింతగా పెంచుకోనున్నారు. సాంకేతికత అందరికీ అందుబాటులో ఉండాలని ఇరు దేశాలు బలంగా నమ్ముతున్నాయి. ఆ సాంకేతికత ఉమ్మడి ప్రగతికి వారధిలా మారాలని నేతలు ఆకాంక్షించారు.

### అత్యున్నత శక్తుల కలయిక

సంయుక్త ప్రెస్‌మీట్‌లో బ్రెజిల్ అధ్యక్షుడు లులా ద సిల్వా మాట్లాడుతూ, "నా ప్రియ మిత్రుడు మోదీని మళ్లీ కలవడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ గొప్ప దేశానికి రావడం నాకు ఇది ఆరోసారి. ఇక్కడ నాకు దక్కిన గౌరవానికి అమితంగా సంతోషిస్తున్నాను. భారత్, బ్రెజిల్ దేశాల భేటీ సాధారణమైనది కాదు. ఇదొక అత్యున్నత శక్తుల కలయిక. మనం గ్లోబల్ సౌత్‌లో కేవలం రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు మాత్రమే కాదు. ఒకటి 'డిజిటల్ సూపర్ పవర్' (భారత్), ఇంకోటి 'పునరుత్పాదక ఇంధన సూపర్ పవర్' (బ్రెజిల్). మన రెండు దేశాలు అపారమైన జీవ, సాంస్కృతిక వైవిధ్యానికి కేంద్రాలు. ప్రపంచ శాంతిని, బహుపాక్షిక విధానాలను రెండు దేశాలు బలంగా విశ్వసిస్తాయి" అని లులా పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న సమన్వయం, పరస్పర విశ్వాసానికి ఈ పర్యటనలు అద్దం పడుతున్నాయని ఆయన అన్నారు. మారుతున్న భౌగోళిక రాజకీయాల నేపథ్యంలో భారత్, బ్రెజిల్ పాత్ర చాలా కీలకమని లులా స్పష్టం చేశారు. "ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అస్థిరమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో రెండు దేశాలు వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకోవాలి. ఐక్యరాజ్యసమితి, డబ్ల్యూటీవో, జీ20 వంటి అంతర్జాతీయ వేదికలపై భారత్, బ్రెజిల్ గొంతుకలు ఎంతో కీలకం. అంతర్జాతీయ చట్టాలకు లోబడి, మరింత న్యాయబద్ధమైన, శాంతియుతమైన బహుపాక్షిక ప్రపంచాన్ని నిర్మించడంలో మనమే ప్రధాన భాగస్వాములం" అని ఆయన ఉద్ఘాటించారు.

# పవన్ కల్యాణ్ చొరవతో కొణిదెల గ్రామానికి మహర్దశ

## మొదటి పేజి తరువాయి

2019 ఎన్నికల ప్రచార సమయంలో తన ఇంటి పేరుతో ఉన్న కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం, గత ఏడాది నియోజకవర్గ పర్యటనలో రూ. 50 లక్షల విరాళం అందజేశారు. గ్రామస్థుల ప్రధాన సమస్య అయిన తాగునీటి ఎద్దడిని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, ఆ నిధులతో 90,000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మించాలని సూచించారు. ఈ ట్యాంకు ద్వారా గ్రామంలోని సుమారు 2,000 మందికి రక్షిత తాగునీరు అందనుంది. వేసవికి ముందే నిర్మాణం పూర్తి కావడం పట్ల పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేస్తూ, అధికారులను అభినందించినట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ ట్యాంకుతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా సుమారు రూ. 6 కోట్లకు



పైగా నిధులను గ్రామానికి మళ్లించారు. 'పల్లెపండగ 1.0' కింద రూ. 20 లక్షలతో మూడు అంతర్గత రహదారులు పూర్తి కాగా, 'పల్లెపండగ 2.0'లో రూ. 45 లక్షలతో ఏడు సీసీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ కింద కొణిదెల జిల్లా పరిషత్ స్కూల్ నుంచి లక్ష్మాపురం వరకు 5 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 4 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి గ్రామానికి రహదారి పునరుద్ధరణకు రూ. 45 లక్షలు మంజూరు చేయించారు. వీటితో పాటు గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు 4 గోకులాలు, గృహ నిర్మాణ శాఖ ద్వారా 19 ఇళ్లు, నీటితొట్టెలు నిర్మించారు. ఉపాధి హామీ పథకం కింద రైతుల కోసం 49 ఫీడర్ ఛానల్స్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, రెండు మైనర్ కాలువల పునరుద్ధరణ, మూడు కమ్యూనిటీ చెక్ డ్యామ్‌ల మరమ్మతులు కూడా పూర్తి చేశారు. ఇచ్చిన హామీ మేరకు గ్రామస్థులు కోరిన ప్రతి పనిని చేపడుతూ, కొణిదెల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తన ప్రకటనలో పేర్కొంది.

# ప్రసాద్ ' పనుల్లో జాప్యం - సింహాచలంలో భక్తులకు తప్పని ఇబ్బందులు

### త్వరలో సింహాద్రి అప్పన్న చందనోత్సవం - ఇంకా కొనసాగుతున్న పనులు

### పూర్తయిన నిర్మాణాన్ని అప్పగించాలని కోరుతున్న దేవస్థానం

సింహాచలం అప్పన్న దేవస్థానంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలోని చేపట్టిన పనులు ప్రసాద్ పథకం పనులు ఇంకా పలు దశల్లోనే కొనసాగుతున్నాయి. అయితే చందనోత్సవం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ పనులు మరొకసారి చర్చనీయాంశమయ్యాయి. 30వ తేదీన చందనోత్సవం రోజున గోడ కూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో కొన్ని నెలల పాటు పనులు నిలిచిపోయాయి. అయితే గుత్తేదారును బ్లాక్ లిస్టులో పెట్టి కొత్తవారికి పనులను అప్పగించడం గమనార్హం. ఏప్రిల్ 20వ తేదీన జరిగేటటువంటి చందనోత్సవం కంటే ముందుగానే పూర్తయిన నిర్మాణాలేమైతే ఉన్నాయో వాటిని అప్పగించాల్సిందిగా దేవస్థాన అధికారులు ఇప్పటికే పర్యాటక శాఖను కోరుతున్నారు. ప్రసాద్ పనుల్లో అంతులేని జాప్యం: ప్రధానంగా ఎన్టీఆర్ ఘాట్ సమీపంలో వ్యూపాయింట్ నిర్మిస్తున్నప్పటికీ రూ.5.40 కోట్ల వ్యయంతో సింహగిరి రెండో ఘాట్ రోడ్డు ప్రవేశం వద్ద దాదాపు 4 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న బస్ కాంప్లెక్సు నిర్మాణం 80 శాతం పూర్తయింది. అదే విధంగా ఫుడ్ కోర్టులు, దుకాణాలు, టాయిలెట్ల నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. మొత్తం రూ.4.78 కోట్ల వ్యయంతో కొండ దిగువన చేపట్టినటువంటి పుష్కరిణి సత్రం రెండు బ్లాకుల నిర్మాణం దాదాపుగా చివరి దశకు చేరింది. రూ. 11.20 కోట్లతో జీప్లస్ వన్ భవనం: అదే విధంగా రూ.3.80 కోట్ల వ్యయంతో గతంలో చేపట్టిన తొలిపావంచా, మెట్లమార్గం అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోవడం గమనార్హం. హిల్ టాప్ రహదారి మార్గంలో యాత్రికులు వేచి ఉండేందుకు రూ. 11.20 కోట్ల వ్యయంతో నిర్మించిన జీప్లస్ వన్ భవనం పూర్తయింది. ప్రస్తుతం దీనికి ఇంకా తుదిమెరుగులు దిద్దాల్సి ఉంది. నృసింహ మండపంలో 500 మంది కూర్చునే విధంగా నిర్మిస్తున్నటువంటి యాంపీ థియేటర్ పనులు మాత్రం ఇంకా మిగిలే ఉన్నాయి. ముఖ్యంగా ఉత్తరగోపురం ఎదురుగా పాత కల్యాణోత్సవ ప్రాంగణంలో వార్షిక కల్యాణాన్ని నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అంతేకాకుండా సింహగిరిపై రూ. 5.60 కోట్ల వ్యయంతో చేపట్టిన దుకాణ సముదాయ నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యాయి. అయితే ప్రస్తుతం దీన్ని వ్యాపారులకు అప్పజెప్పి వినియోగంలోనికి తీసుకొచ్చారు. అదే రీతిలో దక్షిణ వైపున సింహాచల దేవస్థానం ఆధ్వర్యంలో మెట్ల నిర్మాణాన్ని ఇంకా జరగాల్సి ఉంది.సింహాచలం దేవస్థానంలో రూ. 3.46 కోట్ల వ్యయంతో చేపట్టిన పర్యాటక సమాచార భవనం, ఫుడ్ కోర్టులు, సోలార్ విద్యుత్తు ప్లాంటు నిర్మాణాలపై దేవాదాయ శాఖ కమిషనర్ కొన్ని అభ్యంతరాలను చెప్పినప్పటికీ అప్పటి ఇంజినీరింగ్ అధికారులు మాత్రం కొనసాగించారు. ప్రారంభం కాని యాగశాల: అంతేకాకుండా రూ. 7.70 కోట్లతో చేపట్టిన వివధ పనుల్లో కొన్ని పనులు ఇంకా ప్రారంభమే కాకపోవడం ఆశ్చర్యకరం. ప్రధానంగా త్రిపురాంతక స్వామి ఆలయం క్యూ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయింది. ఇది అప్పగించినట్లయితే చందనోత్సవం రోజు భక్తుల కోసం క్యూ లైన్లను ఇక్కడే ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆలయంలో ఎలివేటర్, పార్కింగ్ ప్రాంగణాలను ఇంకా ప్రారంభించనేలేదు. దేవస్థాన ప్రాంగణంలో నిర్మించవలసిన యాగశాల ఇంతవరకు ప్రారంభమే కాలేదు. ఇవి మాత్రమే కాకుండా రూ.3.75 కోట్ల వ్యయంతో పాన్ ప్రాంత అభివృద్ధి, ఆరు ఎలక్ట్రిక్ మినీ వ్యాన్లు, డిజిటల్ సూచిక బోర్డులు, బ్యాగేజీ స్క్రీనింగ్, సెక్యూరిటీ వ్యవస్థ, మెటల్ డిటెక్టర్లు, తదితర సదుపాయాలను కల్పించాల్సి ఉన్నది. దీనికితోడు ఇటీవల ఇంజినీరింగ్ అధికారుతో సమీక్షను నిర్వహించిన ఈవో వెంకటరావు పూర్తయిన నిర్మాణాలు ఏమైతే ఉన్నాయో వాటిని దేవస్థానానికి తక్షణమే సమర్పించాల్సిందిగా కోరారు. ప్రసాద్ పథకం వివరాలిలా! ప్రసాదం పథకానికి సంబంధించిన వివరాలను

# సంపాదకీయం

## ఐఆర్‌డీఎస్ ఒక జాతీయ అవసరం!

భారతదేశ అభివృద్ధి ప్రణాళికలు ఎంత విశాలంగా, సమగ్రంగా రూపొందించినా అవి క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. కేంద్రం, రాష్ట్రాలు వేల కోట్ల రూపాయలతో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాలు కాగితాలపై అద్భుతంగా కనిపిస్తున్నా గ్రామాల్లో వాస్తవ పరిస్థితుల్లో ఆశించిన మార్పును తీసుకురాలేక పోతున్నాయి. ప్రభుత్వ పథకాలు గ్రామాలకు చేరుతున్నాయి గానీ, వాటి అమలు, పర్యవేక్షణ, మూల్యాంకనం, ప్రజలకు కలిగే ప్రత్యక్ష ప్రయోజనం విషయంలో అనేక లోపాలు కనిపిస్తున్నాయి. దీనికి మూలకారణం గ్రామీణాభివృద్ధికి అంకితమైన ప్రత్యేక పరిపాలనా సేవ లేకపోవడమే. దేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు ప్రధానంగా ఐఏఎస్ అధికారులకు లేదా ఇతర కేంద్ర, రాష్ట్ర సేవల అధికారులకు అదనపు బాధ్యతలుగా అప్పగిస్తున్నారు. ఒక అధికారికి రెవెన్యూ, అభివృద్ధి, ఎన్నికలు, శాంతిభద్రతలు వంటి అనేక బాధ్యతలుండగా, గ్రామీణాభివృద్ధి మరో అదనపు అంశంగా మారుతోంది. ఫలితంగా ఇది తాత్కాలిక పరిపాలనా బాధ్యతగా మిగులుతోంది. గ్రామీణాభివృద్ధి అనేది అత్యంత సున్నిత, విస్తృతమైన ప్రజల జీవితాలతో నేరుగా ముడిపడిన రంగం. దీనికి ప్రత్యేక శిక్షణ, దీర్ఘకాలిక దృష్టి, క్షేత్రస్థాయి అనుభవం, స్థానిక అవసరాలపై లోతైన అవగాహన కలిగిన అధికారుల సేవలు అత్యవసరం. 1993లో అమలులోకి వచ్చిన 73వ రాజ్యాంగ సవరణ భారతదేశ ప్రజాస్వామ్యంలో ఒక మైలురాయి. దీంతో పంచాయతీరాజ్ సంస్థలను స్థానిక స్వయంపాలనా సంస్థలుగా గుర్తించి, గ్రామీణ ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ హోదా కల్పించారు. ఈ సవరణలో భాగంగా 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న 29 అంశాలు గ్రామ పంచాయతీలకు బదలాయించి విధులు, నిధులు, సిబ్బంది వికేంద్రీకరణను అమలు చేయాల్సి ఉంది. అయితే ఈ సవరణ అమలై మూడు దశాబ్దాలు గడిచినా అనుకున్న లక్ష్యం సిద్ధించలేదు. చాలా రాష్ట్రాల్లో పంచాయతీరాజ్ సంస్థలు పేరుకే స్వయంపాలనా సంస్థలుగా మిగిలిపోయాయి. విధులు అప్పగించకపోవడం, నిధులపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ కొనసాగడం, సిబ్బంది ఇతర శాఖలకు లోబడి ఉండడం వంటి కారణాల వల్ల పంచాయతీలు స్వతంత్రంగా పనిచేయలేకపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ గ్రామీణ అభివృద్ధి సర్వీస్ (ఐఆర్‌డీఎస్) ఏర్పాటు చేయడం ద్వారా 73వ రాజ్యాంగ సవరణ లక్ష్యాన్ని సాధించవచ్చు. ఈ అధికారులు ప్రత్యేకంగా గ్రామీణాభివృద్ధి కోసం శిక్షణ పొందినవారుగా, పంచాయతీ, మండల, జిల్లా స్థాయిల్లో పనిచేస్తూ విధులు, నిధులు, సిబ్బంది వికేంద్రీకరణను సమర్థవంతంగా అమలు చేయగలరు. స్థానిక ప్రజల అవసరాలు, సమస్యలు, వనరులు గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం ఐఆర్‌డీఎస్ ద్వారా సాధ్యమవుతుంది. గ్రామీణాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ఉపాధి, కార్యక్రమాల సమన్వయం, మౌలిక వసతుల అభివృద్ధి, నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణ, మూల్యాంకనం వంటి వాటిని ఐఆర్‌డీఎస్ ద్వారా బాధ్యతాయుతంగా అమలుచేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం విభిన్న శాఖల మధ్య చీలిపోయిన బాధ్యతలు ఐఆర్‌డీఎస్ ద్వారా ఒకే వ్యవస్థలోకి రావడంతో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు స్పష్టత లభిస్తుంది. వికసిత భారత్ వంటి జాతీయ లక్ష్యాలు, వీబీజీరామ్‌జీ వంటి గ్రామీణ ఉపాధి, ఆర్థిక స్వావలంబన పథకాలు విజయవంతం కావాలన్నా కూడా ఈ ఐఆర్‌డీఎస్ వ్యవస్థ అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న నిరుద్యోగం, నగరాల వైపు యువత వలసలు, వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాల ఆదాయ అస్థిరత, పథకాల అమలులో లోపాలు ఒక విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక పరిపాలనా సేవ లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదు. పంచాయతీరాజ్ వ్యవస్థ ఆర్థికంగా, పాలనాపరంగా బలపడాలంటే ఐఆర్‌డీఎస్ అత్యవసరం. అందువల్ల కేంద్ర ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేసి 73వ రాజ్యాంగ సవరణలో ఊహించిన విధంగా పంచాయతీరాజ్‌కు ప్రాణం పోయాల్సి ఉంటుంది.

# భారత్-బంగ్లా మళ్లీ చేరువవుతాయా?



బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా దాదాపు ఏడాదిన్నరపాటు పాలించిన మహమ్మద్ యూనస్- ఇండియాతో మైత్రీబంధాన్ని ఎంతమాత్రమూ కాంక్షించలేదు! జమాతే ఇస్లామీ పార్టీ కనుసన్నల్లో నడుచుకుంటూ దిల్లీతో ఢాకా సంబంధాలను దెబ్బతీశారు. ఆయన పాలనలో జరిగిన నష్టాన్ని పూడ్చుకుంటూ, ఉభయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఇండియాకు చేరువ కావాల్సిన బాధ్యత తారిఖ్ రహమాన్ సారథ్యంలో బంగ్లాలో కొత్తగా కొలువుదీరిన ప్రజాప్రభుత్వంపై ఉంది. భారత్, బంగ్లాదేశ్ దీర్ఘకాలిక మిత్రదేశాలు. ముఖ్యంగా షేక్ హసీనా ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఇరుదేశాల మధ్య బలమైన స్నేహబంధం ఉండేది. 2024లో ఆమె పదవీచ్యుతురాలయ్యాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేతగా పగ్గాలు చేపట్టిన యూనస్- ఇండియా వ్యతిరేక భావజాలమున్న జమాతే ఇస్లామీకి దాదాపు 'అధికార ప్రతినిధి'లా పనిచేశారు. ఇండియా భద్రతను ప్రమాదంలోకి నెడుతూ, ఈశాన్య భారత రాష్ట్రాల్లో ముష్కర మూకలు, తిరుగుబాటుదారులు బలం పుంజుకునేలా నిర్ణయాలు తీసుకున్నారు. కొందరు ఉగ్రవాదులను, దిల్లీ అంటే గిట్టని మతఛాందసవాదులను జైళ్ల నుంచి విడుదల చేశారు. తమ దేశంలోని రెడీమేడ్ గార్మెంట్స్ ఫ్యాక్టరీలకు ఇండియా నుంచి ముడిపదార్థాల సరఫరాను అడ్డుకున్నారు. దానివల్ల బంగ్లాలో వందల ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. వేలమంది మహిళలు ఉపాధి కోల్పోయారు. అరేబియా సముద్రం, ఈశాన్య భారత రాష్ట్రాల విషయంలో వివాదాస్పద వ్యాఖ్యలతో దిల్లీని యూనస్ కవ్వించారు. పాకిస్థాన్‌కు చేరువయ్యేందుకు ప్రయత్నించారు. యూనస్ పాలనలో బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై (ప్రధానంగా హిందువులపై) దాడులు పెరిగాయి. ఈ పరిణామాలతో ద్వైపాక్షిక సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. అయితే- యూనస్‌ది ప్రజలు ఎన్నుకున్న సర్కారు కాదు కాబట్టి, ఆ సమయంలో ఢాకాతో సంబంధాల పునర్నిర్మాణంపై దిల్లీ పెద్దగా దృష్టిపెట్టలేదు.

సానుకూల సంకేతాలు

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో తారిఖ్ రహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అఖండ విజయం సాధించింది. దీంతో- యూనస్ పాలనకు తెరపడి, తారిఖ్ ప్రధానిగా ప్రజాసర్కారు ఏర్పాటైంది. దీన్ని దిల్లీ-ఢాకా సంబంధాల మెరుగుదలకు తొలి అడుగుగా భావించొచ్చు. ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఇండియాతో మైత్రీబంధాన్నే తాము కోరుకుంటున్నట్లు బీఎన్‌పీ సంకేతాలిస్తోంది. తారిఖ్ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని మోదీని ఆ పార్టీ ఆహ్వానించింది. హసీనాకు దిల్లీ ఆశ్రయం ఇస్తుండటం ద్వైపాక్షిక సంబంధాలకు ప్రతిబంధకం కాబోదని బీఎన్‌పీ సెక్రటరీ జనరల్ మీర్జా ఫఖ్రుల్ వ్యాఖ్యానించారు. బంగ్లాను అస్థిరపరిచే వ్యాఖ్యలేవీ హసీనా భారత గడ్డపై నుంచి చేయకుండా ఉంటే చాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు! తారిఖ్ కూడా ఎన్నికల ప్రచారంలో దిల్లీ వ్యతిరేక వ్యాఖ్యలకు దూరంగా ఉన్నారు. మరోవైపు- బంగ్లాతో సంబంధాల మెరుగుదలను ఇండియా కూడా కాంక్షిస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. దిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమిట్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తో భేటీ వంటి కారణాలతో తారిఖ్ ప్రమాణ స్వీకారోత్సవానికి మోదీ వెళ్లలేకపోయారు. అయితే ఎన్నికల్లో బీఎన్‌పీ గెలుపు తరవాత తారిఖ్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకార వేడుకకు ఇండియా తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ హాజరయ్యారు. కుటుంబంతో కలిసి భారత సందర్శనకు రావాలని తారిఖ్‌ను ఆహ్వానిస్తూ ఓం బిర్లా ద్వారా మోదీ లేఖ పంపారు. సుహృద్భావ సంబంధాల దిశగా అడుగులు పడుతున్నాయని చెప్పేందుకు ఈ పరిణామాలను సంకేతాలుగా భావించొచ్చు. గతంలో బీఎన్‌పీ అధికారంలో ఉన్నప్పుడు దిల్లీతో అంత సఖ్యతగా మెలగకపోవడం ఒకింత ఆందోళనకర అంశమే. ముఖ్యంగా 2001-06 మధ్య జమాతేతో కలిసి బీఎన్‌పీ అధికారాన్ని పంచుకున్నప్పుడు ఇండియా-బంగ్లా సంబంధాలు పెళుసుబారాయి. ఈశాన్య భారత రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకున్న ముష్కర ముఠాలు, తిరుగుబాటుదారులకు అప్పట్లో బంగ్లా ఆశ్రయమిచ్చింది. ప్రస్తుతం తారిఖ్, బీఎన్‌పీ నేతల వ్యవహార శైలిని చూస్తుంటే గతంలో మాదిరిగా కాకుండా, ఇప్పుడు ఇండియాతో సత్సంబంధాలనే వారు కోరుకుంటున్నట్లు కనిపిస్తోంది.

జమాతే ఒత్తిడికి తలొగ్గొద్దు

ఇండియా, బంగ్లాదేశ్‌లను కేవలం ఇరుగు పొరుగు దేశాల కోణంలో చూడలేం. ప్రాంతీయ భద్రతకు రెండూ కీలకమే. హసీనా అధికారంలో ఉన్నంతకాలం ఇరుదేశాల మధ్య భద్రత, ప్రాంతీయ అనుసంధానత, వాణిజ్యం, పెట్టుబడుల వంటి రంగాల్లో బలమైన సంబంధాలు ఉండేవి. యూనస్ పాలనలో దెబ్బతిన్న సంబంధాలను చక్కదిద్దకపోతే బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థకు అపార నష్టం వాటిల్లుతుందన్న సత్యాన్ని తారిఖ్ గుర్తించాలి. అందుకోసం అవసరమైన చర్యలు చేపట్టాలి. భారత ప్రయోజనాలకు వ్యతిరేకంగా యూనస్ తీసుకున్న నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి! స్వదేశంలో మైనార్టీలపై దాడులను అరికట్టాలి. నదీజలాల విషయంలో వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడంపై దృష్టిపెట్టాలి. చైనాగానీ, పాకిస్థాన్‌గానీ ఇండియాకు వ్యతిరేకంగా బంగ్లాను పావుగా వినియోగించుకోకుండా నివారించాలి. సరిహద్దుల్లో భద్రతను పటిష్ఠపరిచి, అక్రమ వలసలు, మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి. ఢాకాతో స్నేహబంధం దిల్లీకి కూడా కీలకమే. దానితో సంబంధాలు మెరుగ్గా లేకపోతే, ఉగ్రవాదులు, తీవ్రవాదులు, తిరుగుబాటుదారులు అక్కడ ఆశ్రయం పొంది ఇక్కడ రెచ్చిపోయే ముప్పుంటుంది. దక్షిణాసియాలో భారత్‌కు బంగ్లా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్‌తో అనుసంధానించే రవాణా నెట్‌వర్క్‌లపై ఇండియా ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టింది. ఈశాన్య భారత్‌ను ప్రాంతీయ సరఫరా గొలుసుల్లో సమ్మిళితం చేసేందుకు అవి దోహదపడతాయి. బంగ్లాకూ అవి ఆర్థికంగా లాభదాయకమే. ప్రస్తుతం జమాతే బంగ్లాదేశ్ పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. హసీనాను స్వదేశానికి రప్పించడం, పాక్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడం వంటి అంశాల్లో అది బీఎన్‌పీ సర్కారుపై ఒత్తిడి పెంచొచ్చు. దానికి తలొగ్గకుండా, దిల్లీతో సంబంధాల మెరుగుదలకు చర్యలు చేపడితేనే ఢాకా దీర్ఘకాలిక అభివృద్ధికి బాటలు పడతాయి. ఈ వాస్తవాన్ని గుర్తెరిగి తారిఖ్ నడుచుకోవాలి.

# అంతరిస్తున్న తెలుగు వెలుగులు..




జగతికి మాతృభాషే వెలుగు.. అది లేనినాడు సర్వమూ చీకటే అన్నది ఆర్యోక్తి. మాతృభాష ఒక జాతి జీవనశ్వాసలో అంతర్లీనమై ఉంటుంది. కానీ నేడు, కోట్లాది మంది గొంతుకల్లో తేనెలొలికించిన 'తెలుగు తల్లి' అరణ్యరోదన చేస్తోంది. ప్రపంచీకరణ వేగంలో, ఆంగ్ల వ్యామోహపు సుడిగుండంలో చిక్కుకుని మన అమ్మ భాష ప్రాణవాయువు కోసం కొట్టుమిట్టాడుతోంది. మన మాతృభాషపై జరుగుతున్న పద్ధతి ప్రకారం సాగుతున్న 'సాంస్కృతిక హత్య'పై మన అంతరాత్మను ఒక్కసారి తట్టి చూసుకుందాం. పాలకుల నిర్లక్ష్యం వల్ల తెలుగు భాష నేడు సొంత గడ్డపైనే శరణార్థిగా మారింది.

మాటల కోటలు .. ఆచరణ గండి

ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి రాకముందు తెలుగును వెలిగిస్తాం.. పాలనా భాషగా అమలు చేస్తామని ఇచ్చే హామీలు ఆకాశాన్ని తాకుతాయి. కానీ గద్దెనెక్కాక ఆ పట్టింపు ఆవిరైపోతుంది. రాజ్యాంగంలోని 345వ అధికరణం ప్రకారం రాష్ట్ర అధికార భాషను అమలు చేసే సర్వాధికారాలు పాలకులకు ఉన్నప్పటికీ, నేడు ఏపీ సచివాలయం నుంచి వెలువడే జీవోలు, నోటిఫికేషన్లు సామాన్యుడికి అర్థంకాని పరభాషలోనే దర్శనమిస్తున్నాయి. చట్టసభల్లో చర్చలు పరభాషా పదాలతో కలుషితమవుతున్నాయి. తెలుగు భాషా రక్షణ కోసం ఏర్పడిన సంస్థలు నేడు నిధులు లేక, నిర్ణయాధికారం లేక అలంకారప్రాయంగా మిగిలిపోయాయి.

### పునాదులపై గొడ్డలి పెట్టు!

ఒక చిన్నారి మేధోవికాసం మాతృభాషలోనే సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు మొత్తుకుంటున్నా, మన పాలకులు మాత్రం ఆంగ్లం ఉంటేనే అభివృద్ధి అనే భ్రమను సామాన్యుల్లో నాటు తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా కనుమరుగు చేయడం అంటే, భావి తరాల ఆలోచనా శక్తిని అపహరించడమే.. విద్యాబోధన మాతృభాషలో లేనప్పుడు విద్యార్థి కేవలం 'బట్టీ' పడతాడు తప్ప, సృజనాత్మకంగా ఆలోచించలేడు. ఒక విషయాన్ని విశ్లేషించే శక్తి క్షీణిస్తుంది.

### గ్రామీణ విద్యార్థుల ఆవేదన..

పల్లెటూరి పిల్లలకు తమ మాతృభాషలో పాఠాలు చెబితే అద్భుతాలు సృష్టిస్తారు. కానీ వారిపై బలవంతంగా ఆంగ్లాన్ని రుద్దడం వల్ల, వారు చదువులో రాణించలేక మధ్యలోనే బడి మానేసే ప్రమాదం ఉంది. ఆలోచన మాతృభాషలో, మాట పరభాషలో సాగినప్పుడు వ్యక్తీకరణలో స్పష్టత ఉండదు. ఇది విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.

### అంతరిస్తున్న అక్షర సంపద!

యునెస్కో నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు వారాలకు ఒక భాష అంతరిస్తోంది. భారత్‌లో అంతరించిపోతున్న 196 భాషల జాబితాలో తెలుగు కూడా చేరడం అత్యంత ఆందోళనకరం. గత పదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో తెలుగు పత్రికల పాఠకుల సంఖ్య, తెలుగు పుస్తక పఠనం 40 శాతం తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత తరం పిల్లల్లో 60శాతం మంది తెలుగు మాట్లాడగలరు కానీ... ఒక్క పేజీని తప్పుల్లేకుండా చదవలేకపోతున్నారు. ఇది క్రమంగా 'లిపి' మరణానికి దారితీస్తుంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో తెలుగు వినియోగం కేవలం 5శాతం లోపు మాత్రమే ఉండటం శోచనీయం. మనం ఆంగ్లానికి వ్యతిరేకం కాదు, అది జ్ఞానభాషగా ఉండాలి... కానీ మాతృభాషను మింగేసే 'రాహువు' కాకూడదు.

### ఉనికికే ప్రమాదం..

భాష లేని జాతికి ఉనికి లేదు. మన తెలుగు భాష మన అస్తిత్వానికి ప్రతీక. పాలకుల విధానాలు మనల్ని భాషా అనాథలను చేస్తున్నప్పుడు, ప్రజలే ఉద్యమించాలి.. మన అమ్మ భాషను కాపాడుకోవడం అంటే మన సంస్కృతిని, మన మూలాలను కాపాడుకోవడమే. పాలకులు తక్షణమే తమ మొండి వైఖరిని వీడి, తెలుగును బతికించే దిశగా అడుగులు వేయాలి. లేదంటే, రాబోయే తరాలు మనల్ని 'భాషా ద్రోహులు'గా చరిత్ర పుటల్లో నిలదీస్తాయి. అందుకే భావితరాల కోసం మాతృ భాషను కాపాడుకుందాం.

# పీఠాల కోసమే పితలాటకం




పరస్పర విరుద్ధం. నక్కకు నాకలోకానికి ఉన్నంత వ్యత్యాసం. కాకతాళీయమో.. మరేంటో గానీ.. ప్రత్యక్ష సాక్షీభూతం. రాష్ట్రమంతా చూసిన నిష్ఠూర సత్యం. బంధాలు వెతుక్కుంటూ వెళ్లిన సుందర దృశ్యాలు ఒకవైపు.. వెక్కివెక్కి ఏడుస్తూ బాధను దిగమింగుకున్న బందీల చిత్రాలు మరోవైపు. ప్రజానేతను కలిసేందుకు పరుగులు తీసిన జనసందోహం ఇటు.., జనతీర్పును కుర్చీలాటలో పలుచన చేసిన తీరును ప్రశ్నించిన వారిని ఉరికిచ్చి కొట్టిన ఖాకీ కర్రల స్వైరవిహారం అటు. రాజకీయం నాటకీయంగా మారి.. ప్రజల ఇష్టాన్ని ఇనుప చువ్వల్లో బంధించిన తీరు హాస్యాస్పదం.. ఆలోచించాల్సిన సందర్భం. ఒకవైపు ప్రజానేత, తెలంగాణ జాతిపిత. రాష్ట్ర సాధన కార్యదక్షుడు కేసీఆర్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా తెలంగాణవాసి నివాసం ఏర్పర్చుకున్న ప్రతి గల్లీలో జరుపుకుంటున్న వేళ.. మున్సిపల్ పీఠాల కైవసానికి 'చేతి'వాటం ప్రదర్శించిన అధికార దర్పం మరోవైపు వికటాట్టహాసం చేసిన తీరు గర్హనీయం. రెండేండ్ల రెఫరెండంగా భావించారో.. మూడేండ్లు ముందున్నదనే తెగించారోగానీ యంత్రాంగమంతా ఒక్కతాటిపైకి వచ్చింది.. చేయిచేయి కలిపింది.. చేతనైనంతా శ్రమించింది..సాధ్యమైనన్ని కుర్చీలు 'చే'జిక్కేలా చేసుకున్నది. తెరవెనుక ఆదేశాలైతేనేం.. తెరముందు బలప్రదర్శన చేయడమైతేనేం.. చేయాల్సింది చేసి.. రచ్చ రచన చేసిన భయానక చిత్రాల పరంపర గత కొద్దిరోజులుగా రాష్ట్రమంతా ఎక్కడ చూసినా లెక్కకు మిక్కిలే. రాష్ట్రానికి ప్రజాపాలనను అలవాటు చేస్తామని చెప్పి ఆట మొదలుపెట్టిన రేవంత్ బలగం ఇప్పుడు ఏ రకపు పాలనకు తెర తీస్తున్నట్టో తేలిపోతున్నది. తెలిసిపోతున్నది. సంఖ్యా బల నిరూపణలో అడ్డగోలు కొనుగోళ్ల లావాదేవీల్లో అంతర్గతంగా ఆగమాగమై, అనుకున్నట్టుగా కూడబెట్టుకున్న లెక్కలను మాత్రం బహిర్గతం చేసేందుకు యావత్తు రాష్ట్ర పాలకులు, యంత్రాంగం పడిన శ్రమను ఏ రకమైన రూలింగ్‌గా భావించాలో ఏలికలకే తెలియాలి. మున్సిపాలిటీల్లో మురుగు, కార్పొరేషన్లలో కంపు కార్యాలకు తెరతీసి, ప్రజా తీర్పును అపహాస్యం చేస్తూ లాక్కోవడాలు, నిర్బంధించడాలు చేస్తూ మూట గట్టుకున్న మకిలికి ఏ పేరు పెడుతారో వాళ్లే సెలవియ్యాలి. ప్రజా బలం కూడగట్టడం వేరు, ఇతరుల బలాన్ని లాక్కోవడానికి మందీమార్బలంతో కూడబలుక్కోవడం వేరు. న్యాయంగా గెలిచిన వాటిని దక్కించుకునే అర్హతను నీళ్లపాలు చేసి, అన్యాయంగా హస్తగతం చేసుకోవడం అతి సాధారణమైంది. ఇవ్వాళ రచన చేసి అంతా తమదే, అన్నీ తమ వైపే అన్నట్టుగా తెగింపు చూపిన కాంగ్రెస్ సర్కార్ విన్యాసం మున్సిబ్‌లోని పరమ కార్పొరేట్ పాలనే. జనమంతా జననేత కోసం పరుగులు తీస్తున్న తరుణంలో రోడ్లపై ఓ వైపు ఉత్సవ వాతావరణం, కుర్చీలు లాగే తీరుతో మరోవైపు ఉద్రిక్త వాతావరణం. ఇచ్చిన తీర్పును మార్చే అవకాశం చేతిలో ఉండొచ్చుగానీ, నచ్చిన నాయకుడి వైపు ఉండే ప్రజలను నిలువరించడం ఎవరి చేతిలో లేదని చెప్పడానికి ఉత్సవాలు, పండుగ వాతావరణంలో జరిగిన అట్టహాసపు వేడుకలే నిదర్శనం. సాధింపులు.. వేధింపుల పర్వాలు తాత్కాలికమే, సాధించిన ఘనకీర్తే శాశ్వతం అనే ముచ్చట మరిచి.. తోచింది చేస్తూ, నచ్చినట్టుగా నడుస్తామనే రీతిగా సాగుతున్న కాంగ్రెస్ పాలనకు అంటుకున్న మరకలు ఎప్పటికీ చెరిగిపోవనేది ఎంతటి నిష్ఠూర సత్యమో..ఎంతో చేసిన నేతకు మరకలు పూయాలని చూసే ప్రయత్నాలు క్షణికాలే అనేది అంతకు మించిన కఠోర వాస్తవం. గుండెల్లో పెట్టుకున్న నాయకుడిని కనబడకుండా దాచేయడం సాధ్యమయ్యేనా, తొక్కుతూ నడిచే వారిని హత్తుకుని తోడు నిలవడం జరిగే పనేనా? రాజకీయ క్రీడను వికృతంగా మలిచేందుకు పాలకులు చేసే యత్నంలో వందో వంతైనా జనశ్రేయస్సుపై పెడితే కొందరితోనైనా శభాష్ అనిపించుకోవచ్చు కదా! ప్రజానేతను రాచి రంపాన పెట్టాలని చూడటమే దినచర్యలో ఆఖరి పేజీలో రాయాల్సిన తరుణంలో అక్షరాలు దొరకవనే ముచ్చట గుర్తెరిగి మసులుకుంటే ప్రతికార్యం ప్రజాక్షేత్రంలో నిలిచేదిగా చేయాలనిపిస్తుంది. ఆ స్పృహ ప్రతిక్షణం వెంటాడుతూ హెచ్చరిస్తుంది.

ఉన్నది మేమే, అందుకే ఇటువైపు రావాల్సిందే, రేపటి నుంచి మాతో నడవాల్సిందే.. అని హుకుం జారీ చేసి పర బలాన్ని తమ బలంగా మలుచుకున్న తీరులో ఆర్థిక వ్యవహారాలు. భయాందోళనకు తీసిన తెరలతో నడిపిన పీఠాల పితలాటకాన్ని రాష్ట్రం చూసింది. ప్రలోభపర్వాలు, ఓట్ల కొనుగోళ్ల వ్యవహారంతో కలుషితం చేసిన ఘనాపాఠి క్రతువు వర్ధిల్లుతున్న ఎన్నికలస్వామ్యంలో వారంతట వారుగా ఇచ్చిన తీర్పును సైతం మళ్లీ కొనుగోలు, అమ్మకాల బేరాల్లో ముంచి సీట్ల సర్దుబాట్లు చేసుకుంటున్న తీరులో ఓట్లెందుకు.. గెలుపోటములు దేనికి? ఎన్నికల ముందు పార్టీల బలాబలాలు ఇవి అనే లెక్కలు వల్లెవేయాల్సిన అవసరం ఏమున్నది? 'మీకిన్ని..మాకిన్ని అని, లేదంటే అధికారంలో ఉన్నది మేమే కాబట్టి అంతా మాదే' అన్నట్టుగా ప్రజలను ఓ మూలన కూర్చోబెట్టి అంతా తమదే.. అని ప్రకటించుకుంటే పోయేది ఏమున్నది! ఆ మాత్రం దానికి అన్నేసి ఖర్చులు, ఎందరెందరో అన్నన్ని కష్టాలు పడడం ఎందుకు? పెట్టెల్లో రహస్యంగా నిక్షిప్తమయ్యే తీర్పును లెక్క చేయకుండా, ముందే ప్రణాళిక




## ది కేరళ స్టోరీ సీక్వెల్..ట్రైలర్ విడుదల

### సంచలనం సృష్టిస్తున్న ట్రైలర్


2023లో బాక్సాఫీస్ వద్ద వివాదాలు సృష్టించిన 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో, తాజాగా చిత్ర యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేయగా.. ఈ ట్రైలర్ సామాజిక మాధ్యమాల్లో పెను దుమారం రేపుతోంది. మొదటి భాగం కంటే ఈ సీక్వెల్ మరింత వివాదాస్పదంగా, అత్యంత తీవ్రమైన అంశాలతో రూపొందినట్లు ట్రైలర్ చూస్తుంటే స్పష్టమవుతోంది. రాబోయే 25 ఏళ్లలో భారత్ ఇస్లామిక్ రాజ్యంగా మారుతుంది అనే వివాదాస్పద డైలాగ్‌తో ఈ ట్రైలర్ ప్రారంభంకాగా.. ఈసారి దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ కథను కేవలం కేరళకే పరిమితం చేయకుండా.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరుగుతున్నట్లు చెబుతున్న బలవంతపు మత మార్పిడిలు, లవ్ జిహాద్ వంటి అంశాలను ఇందులో చూపించారు. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించిన ఈ చిత్రంలో గతంలో నటించిన అదా శర్మ స్థానంలో ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రలు పోషించారు. మత మార్పిడికి నిరాకరించిన యువతులను చిత్రహింసలకు గురిచేయడం, బలవంతంగా గొడ్డు మాంసం తినిపించడం వంటి కఠినమైన దృశ్యాలను మేకర్స్ ఈ ట్రైలర్‌లో పొందుపరిచారు. అయితే ఈ ట్రైలర్‌పై కేరళ నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా బలవంతంగా గొడ్డు మాంసం తినిపించే సన్నివేశంపై వారు మండిపడుతున్నారు. కేరళలో బీఫ్‌ను అందరూ ఇష్టంగా తింటారని, ఎవరికీ బలవంతంగా తినిపించాల్సిన అవసరం లేదని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు, ఈ సినిమా సమాజంలోని చేదు నిజాలను ధైర్యంగా చూపిస్తోందని మరికొందరు సమర్థిస్తున్నారు.

## చాలాకాలం రుచి, వాసన శక్తిని కోల్పోయా

### తన అనారోగ్యంపై మమ్ముట్టి తొలిసారి వివరణ



మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి తన అనారోగ్యంపై వస్తున్న వార్తలపై తొలిసారి స్పందించాడు. గత ఏడాది జూన్ సమయంలో ఆయన అనారోగ్యానికి గురై దాదాపు నాలుగు నెలల పాటు సినిమాలకు విరామం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి తొలిసారిగా మీడియాతో మాట్లాడారు. తాను చాలా కాలం పాటు రుచి, వాసన చూసే శక్తిని కోల్పోయానని, ఇప్పుడి ప్పుడే నెమ్మదిగా ఆ ఇంద్రియ జ్ఞానాన్ని తిరిగి పొందుతున్నానని తెలిపారు. కంటి చూపు, వినికిడితో పాటు శ్వాస తీసుకునేటప్పుడు వాసనను గుర్తించగలగడం కూడా ఒక గొప్ప వరమని, అటువంటి సామర్థ్యాలను కోల్పోయినప్పుడే వాటి విలువ అర్థమవుతుందని ఆయన భావోద్వేగంగా మాట్లాడారు. ముఖ్యంగా వినికిడి శక్తి లేని వారి బాధ వర్ణనాతీతమని, మనం ఇతరుల గొంతును వినగలుగుతున్నాం కాబట్టే వారిని మెల్లగా మాట్లాడమని అడగగలమని, కానీ ఆ సామర్థ్యం లేని వారికి శబ్దాల మధ్య తేడా తెలియదని పేర్కొన్నారు. ప్రస్తుతం మమ్ముట్టి పూర్తి ఆరోగ్యంతో తిరిగి షూటింగ్‌లలో బిజీ అయ్యారు. మహేష్ నారాయణన్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బ్జడెట్ చిత్రం 'పేట్రియాట్'. ఈ సినిమా కోసం మమ్ముట్టి ఇటీవలే డబ్బింగ్ పనులను కూడా పూర్తి చేశారు. ఈ సినిమా మలయాళ చిత్ర పరిశ్రమలో ఒక ప్రత్యేక మైలురాయిగా నిలవనుంది. ఎందుకంటే సుమారు 18 ఏళ్ల తర్వాత మమ్ముట్టి, మోహన్ లాల్ కలిసి పూర్తిస్థాయి పాత్రల్లో స్క్రీన్‌ను పంచుకుంటున్నారు. వీరిద్దరితో పాటు విలక్షణ నటుడు ఫహాద్ ఫాజిల్ విలన్‌గా నటిస్తుండటం విశేషం. నయనతార, కుంచాకో బోబన్ ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




### అక్కినేని ప్రేమాభిషేకానికి

## 45 ఏళ్లు పూర్తి

అక్కినేని నాగేశ్వరరావు నటించిన చిత్రాల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే ఐకానిక్ సినిమా 'ప్రేమాభిషేకం'. అప్పట్లో ఇది సిల్వర్ జూబ్లీ జరుపుకుంది. దేవదాసు తరవాత మళ్లీ అంతటి సినిమాగా ప్రాచుర్యం పొందింది. ఈచిత్రం విడుదలై 45 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ప్రత్యేక వీడియోను పంచుకుంది. లక్షల మంది హృదయాల్లో ఏఎన్నార్ ఎప్పటికీ జీవించే ఉంటారని పేర్కొంది.




## అలియాకు బాఫ్టా గౌరవం

ప్రముఖ బాలీవుడ్ కథానాయిక అలియా భట్‌కు మరోసారి అంతర్జాతీయ గౌరవం దక్కింది. బాఫ్టా(బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్) 79వ ఎడిషన్ పురస్కారాలను అందించే ప్రెజెంటర్ల జాబితాను ప్రకటించింది. అందులో మన దేశం నుంచి బాలీవుడ్ కథానాయిక అలియా భట్ పాల్గొననున్నారు. గతంలో ప్రియాంక చోప్రా, దీపికా పదుకొణెలకు ఈ గౌరవం దక్కింది. ఈ వేడుక.. లండన్‌లోని రాయల్ ఫెస్టివల్ హాల్‌లో ఫిబ్రవరి 22న జరగనుంది. బాఫ్టా అవార్డుల నామినేషన్‌లలో బెస్ట్ చిల్డ్రన్ అండ్ ఫ్యామిలీ విభాగం నుంచి మణిపురి చిత్రం 'బూంగ్' నామినేట్ అయింది. తల్లిని బహుమతితో ఆశ్చర్యపరచాలని ప్రయత్నించే బూంగ్ అనే బాలుడి కథాంశంతో తెరకెక్కింది చిత్రం. దీంతో దర్శకురాలు లక్ష్మీ ప్రియదేవి కూడా ఈ వేడుకకి హాజరవుతారని సమాచారం. ఈ సినిమాని ఫర్హాన్ అక్తర్, రితేష్ సిధ్వాని తదితరులు సంయుక్తంగా నిర్మించారు.

### అల్లు, అట్లీల మూవీ రికార్డు

## అనౌన్స్‌మెంట్ సాంగ్‌కు మిలియన్ వ్యూయర్స్


ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న భారీ ప్రాజెక్ట్ ఎఎ23. కేవలం ఒక చిన్న అనౌన్స్‌మెంట్ వీడియోతోనే సరికొత్త చరిత్రను సృష్టించింది ఈ కాంబో. అయితే సినిమా కోసం సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఓ పాటను కంపోజ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పాట ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును అందుకుంది. ఈ పాటకి ఇన్‌స్టాలో 1 మిలియన్ కంటే ఎక్కువ రీల్స్



అందుకున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో ఒక ఇండియన్ ఫిల్మ్ అనౌన్స్‌మెంట్ థీమ్ ఈ స్థాయిలో వైరల్ అవ్వడం ఇదే తొలిసారి అని ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అరుదైన ఘనత సాధించిన సందర్భంగా అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ కలిసి దిగిన ఫోటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ చక్కర్లు కొడుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ షూటింగ్ 2026లో ప్రారంభం కానుంది.

## బాలీవుడ్ వైపు తొలి అడుగు?

గతేడాది 'మదరాసి', 'కాంతార 2' లాంటి చిత్రాలతో మంచి విజయాన్ని అందుకుంది కథానాయిక రుక్మిణీ వసంత్. చిత్రపరిశ్రమకు వచ్చిన తక్కువ రోజుల్లోనే భాషతో సంబంధం లేకుండా అవకాశాల్ని అందుకుంటోన్న ఈ భామ.. బాలీవుడ్‌లో తన తొలి చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. 'కిల్' ఫేమ్ నిఖిల్ నగేశ్ భట్ దర్శకత్వంలో హిందీ హీరో కార్తిక్ ఆర్యన్ ఓ చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో కథానాయికగా రుక్మిణీని ఎంపిక చేసినట్లు సమాచారం. స్క్రిప్ట్ ఇంకా ప్రారంభ దశలోనే ఉందని, త్వరలో నటీనటుల వివరాలతో ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నాయని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. టీ సిరీస్ నిర్మాణంలో రాబోతున్న ఈ సినిమాతో రుక్మిణి, కార్తిక్‌ల జోడీ మెరుపులు ఎలా ఉంటాయో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే. ప్రస్తుతం రుక్మిణి ఖాతాలో 'టాక్సిక్'తో పాటు పలు చిత్రాలున్నాయి.



# భార్యపై హత్యాయత్నం...

## రెండో పెళ్లి వివాదంతో ఘోరం, భర్త అరెస్ట్....

పెద్దపల్లి//ఫిబ్రవరి 21 **ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లాలో కుటుంబ విభేదాలు ఘోరానికి దారితీశాయి. భార్యపై హత్యాయత్నం చేసిన భర్తను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన జిల్లాలో సంచలనం రేపింది. పోలీసుల ప్రకారం, కాల్వ శ్రీరాంపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన ఓదెల మల్లయ్య ప్రస్తుతం సింగరేణి నుంచి రిటైర్డ్ అయి శ్రీరాంపూర్ గాంధీనగర్‌లో నివసిస్తున్నాడు. అతని కూతురు నూనె పద్మ (45)కు 2010 సంవత్సరంలో పెద్దంపేట గ్రామానికి చెందిన నూనె వెంకటేష్ (45), సింగరేణి ఉద్యోగితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె లాస్య (12), ఒక కుమారుడు నవనీత్ కుమార్ (10) ఉన్నారు.వివాహానంతరం కొన్ని సంవత్సరాల నుంచి దాంపత్య జీవితంలో మనస్పర్థలు ఏర్పడటంతో ఇద్దరూ వేరు వేరుగా ఉంటున్నారు. ఈ విషయమై పెద్దపల్లి, మంచిర్యాల కోర్టుల్లో కేసులు కూడా నడుస్తున్నాయి. ఈ క్రమంలో వెంకటేష్ రెండో వివాహం చేసుకున్నాడు.ఫిబ్రవరి 19న పద్మ తన తండ్రితో కలిసి పెద్దపల్లి కోర్టులో విడాకుల కేసు హాజరుకావడానికి వచ్చింది. కేసు ముగిసిన అనంతరం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో తండ్రి ఆమెను బస్ స్టాండ్ వద్ద వదిలి వెళ్లిపోయాడు. అదే రోజు సాయంత్రం 6 గంటల సమయంలో తండ్రి ఫోన్ చేయగా పద్మ ఇబ్బందిగా మాట్లాడినట్టు తెలిసింది. అనంతరం ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది.తన కూతురు కనిపించక పోవడంతో మల్లయ్య బంధువుల వద్ద విచారణ జరిపినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో అల్లుడు వెంకటేష్‌పై అనుమానం కలిగిన తండ్రి ఫిబ్రవరి 20న రంగంపల్లి గ్రామంలో అతని ఇంటికి వెళ్లి ప్రశ్నించగా, "నాపై కేసులు పెట్టి ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకుంటానాడ నీ కూతురిని జాఫర్ ఖాన్ పేట శివారు మైసమ్మ గుడి దగ్గర కొట్టి పడేశాను" అని చెప్పినట్టు తెలిపారు.దీంతో బంధువులతో కలిసి వెతుకులాట జరిపిన కుటుంబ సభ్యులు అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో జాఫర్ ఖాన్ పేట మైసమ్మ గుడి సమీపంలో పద్మను తీవ్ర గాయాలతో మూర్ఛపోయిన స్థితిలో కనుగొన్నారు. వెంటనే ఆమెను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని కియా ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పద్మను పోలీసులు విచారించగా, పెద్దపల్లి బస్ స్టాండ్ వద్ద వెంకటేష్ తనతో మాట్లాడాలని బెదిరించి బైక్‌పై ఎక్కించుకుని జాఫర్ ఖాన్ పేట శివారుకు తీసుకెళ్లాడని తెలిపింది. అక్కడ తనపై పెట్టిన మెయింటెనెన్స్ కేసులు ఉపసంహరించుకోవాలని, లేకపోతే చంపేస్తానని బెదిరించాడని వెల్లడించింది. తాను ఒప్పుకోక పోవడంతో చేతులతో కొట్టి కిందపడేసి, అక్కడ ఉన్న బండరాయితో తలపై బలంగా కొట్టాడని వివరించింది.ఈ మేరకు ఫిబ్రవరి 21 ఉదయం 8.30 గంటలకు బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అనంతరం అదే రోజు మధ్యాహ్నం 3.45 గంటలకు రంగంపల్లి గ్రామంలో నిందితుడు వెంకటేష్‌ను అరెస్ట్ చేసి, నేరానికి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పత్తి కొనుగోలు గడువు వారం రోజులు పెంపు...

## పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు కృషి ఫలితం...



పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 21 **ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా పత్తి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కలిగించింది. పత్తి కొనుగోలు ప్రక్రియను మరో వారం రోజుల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఫిబ్రవరి 20తో ముగియాల్సిన కొనుగోలు ప్రక్రియను ఫిబ్రవరి 27 వరకు కొనసాగించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.పత్తి కొనుగోలు ప్రక్రియను ఫిబ్రవరి 20తో ముగిస్తామని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జజ×) ముందుగా ప్రకటించడంతో పెద్దపల్లి జిల్లా సహా పలు ప్రాంతాల రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇంకా గోదాముల్లో నిల్వలో ఉన్న పత్తి విక్రయానికి అవకాశం లేకపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు స్పందించి రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఫోన్ ద్వారా సంప్రదించి, జిల్లాలో మిగిలిన పత్తి నిల్వలు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు గడువును పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు, సిసిఐ సంస్థకు రైతుల పరిస్థితిని వివరించి కొనుగోలు ప్రక్రియను మరికొన్ని రోజులు కొనసాగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వం ఫిబ్రవరి 27 వరకు పత్తి కొనుగోలు గడువును పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ నిర్ణయంతో పెద్దపల్లి జిల్లా రైతులు ఉపశమనం పొందారు. ఇంకా విక్రయానికి మిగిలి ఉన్న పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముకునే అవకాశం లభించింది. రైతుల కష్టాలను అర్థం చేసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి గడువు పెంపుకు కృషి చేసిన ఎమ్మెల్యే విజయరమణరావు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే విజయరమణరావు సూచించారు. రైతుల ప్రయోజనాల కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.

# పెళ్లి వేడుకలో చెలరేగిన గొడవ, వ్యక్తిపై కత్తులతో దాడి...



పెద్దపల్లి//ఫిబ్రవరి 21 **ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని సెంటనరీ కాలనీ సింగరేణి ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం జరిగిన పెళ్లి వేడుక ఉద్రిక్తతకు దారి తీసింది. పెళ్లి కార్యక్రమం జరుగుతున్న సమయంలో అప్రత్యక్షంగా రెండు వర్గాల మధ్య వాగ్వాదం మొదలై కొద్ది సేపటికే ఘర్షణగా మారింది. ఈ గొడవలో భాగంగా గేటు ముందు నిలబడి ఉన్న కొమురయ్య అనే వ్యక్తిపై కొందరు వ్యక్తులు కత్తులతో దాడికి పాల్పడినట్లు సమాచారం. తీవ్ర గాయాలతో బాధపడుతున్న కొమురయ్యను స్థానికులు వెంటనే సమీప ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఆయన పెద్దపల్లి జిల్లా బేగంపేట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఘటనతో పెళ్లి వేడుకలో ఉన్న అతిథులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమికంగా పాత వ్యక్తిగత విభేదాలే ఈ దాడికి కారణంగా ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. దాడిలో పాల్గొన్న వ్యక్తులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# చనిపోయినా వీడని బంధం....

## శ్మశానంలో యజమాని సమాధి వద్దే కూర్చున్న పెంపుడు కుక్క....



నల్గొండ//ఫిబ్రవరి 21 **ఆకాంక్ష :** నల్గొండ జిల్లా కిష్టాపురం గ్రామంలో హృదయాన్ని కలచివేసే సంఘటన వెలుగులోకి వచ్చింది.తన యజమానిపై పెంపుడు కుక్క చూపిన అపారమైన ప్రేమ, విశ్వాసం గ్రామస్థులనే కాదు నెట్టింట ఉన్న ప్రతి ఒక్కరినీ కదిలిస్తోంది. గ్రామానికి చెందిన పార్వతమ్మ అనే వృద్ధురాలు ఎంతో ప్రేమతో ఒక శునకాన్ని పెంచుకుంటూ జీవనం సాగించేది. ఆ మూగజీవిని తన కుటుంబ సభ్యుడిలా చూసుకునే పార్వతమ్మపై ఆ కుక్కకూ అంతే మమకారం ఏర్పడింది. ఇటీవల పార్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, గ్రామస్థులు ఆమెకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. అయితే అంత్యక్రియలు పూర్తయ్యాక కూడా ఆ పెంపుడు కుక్క తన యజమాని సమాధి వద్ద నుంచి కదలకుండా ఉండిపోవడం అందరినీ కలచివేసింది. మండు టెండలోనూ, ఎండను లెక్క చేయకుండా సమాధి పక్కనే కూర్చుని తన యజమానిని ఎదురు చూస్తున్నట్లుగా కనిపించడం హృదయ విదారకంగా మారింది.ప్రతిరోజూ గ్రామస్థులు ఆ కుక్కకు ఆహారం, నీరు అందించేందుకు ప్రయత్నించినా, అది ఎక్కువగా తన యజమాని సమాధి దగ్గరే ఉండటానికే మొగ్గుచూపుతోంది. సమాధి చుట్టూ తిరుగుతూ, కొన్ని సార్లు మౌనంగా కూర్చుని ఉండే దృశ్యాలు గ్రామంలో ప్రతి ఒక్కరిని భావోద్వేగానికి గురి చేస్తున్నాయి. మనుషులకంటే మూగజీవుల ప్రేమ గొప్పది" అనే మాటను ఈ సంఘటన మరోసారి నిజం చేస్తోందని గ్రామస్థులు భావోద్వేగంతో చెబుతున్నారు.ఈ హృదయాన్ని కదిలించే దృశ్యాలను కొందరు యువకులు వీడియోగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో, ఆ వీడియో వేగంగా వైరల్‌గా మారింది. నల్గొండ జిల్లా కిష్టాపురంలో జరిగిన ఈ సంఘటనను చూసిన నెటిజన్లు ఆ పెంపుడు కుక్క విశ్వాసానికి మంత్రముగ్ధులవుతూ, తమ స్పందనలు తెలియజేస్తున్నారు.మరణానికీ అతీతంగా నిలిచే బంధాలు ఉంటాయని, ప్రేమకు సరిహద్దులు ఉండవని ఈ సంఘటన స్పష్టం చేస్తోంది. యజమాని లేకపోయినా, ఆమె జ్ఞాపకాలతో జీవిస్తున్న ఆ పెంపుడు కుక్క ప్రేమ, విశ్వాసం నల్గొండ జిల్లా కిష్టాపురం గ్రామాన్ని ఒక్కసారిగా భావోద్వేగంలో ముంచెత్తింది.

## సిఐ ఇంద్రసేనారెడ్డిపై చర్యలు తీసుకోక పోవడాన్ని

# నిరసిస్తూ సోమవారం న్యాయవాదుల అత్యవసర సమావేశం...




## గోదావరిఖని కోర్టులో న్యాయవాదుల విధుల బహిష్కరణ కొనసాగింపు....

గోదావరిఖని//ఫిబ్రవరి 21 **ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో న్యాయవాదుల విధుల బహిష్కరణ సోమవారం వరకు కొనసాగనుంది. వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి వ్యవహారశైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న న్యాయ వాదులు, ఈ ఘటనపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు న్యాయవాది తిలక్ తెలిపారు. ఎనిమిది రోజులుగా నిరవధికంగా విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో న్యాయవాది తిలక్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన న్యాయ వాదులు, సీఐ ఇంద్రసేనారెడ్డి మరియు గన్‌మెన్ ప్రవీణ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత న్యాయవాదికి న్యాయం జరిగే వరకు తమ ఆందోళనను విరమించబోమని స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో న్యాయవాదుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఈ విషయంపై సోమవారం నిర్వహించనున్న అత్యవసర సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించి, తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు.గోదావరిఖని కోర్టు ప్రాంగణంలో రోజురోజుకీ ఆందోళనలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. న్యాయవాదులు నిరసన కార్యక్రమాలు చేపట్టి, న్యాయ వ్యవస్థకు గౌరవం కల్పించాలని, తమ భద్రతకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సంఘటనపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. న్యాయ వాదుల నిరసనలతో గోదావరిఖని కోర్టు కార్యకలాపాలు ప్రభావితమవుతున్నాయి. సాధారణ ప్రజలకు న్యాయం అందడంలో ఆలస్యం జరుగుతున్నప్పటికీ, న్యాయవాదుల భద్రత, గౌరవం కోసం ఈ పోరాటం కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. సోమవారం సమావేశం తర్వాత ఆందోళనకు కొత్త రూపురేఖలు సిద్ధమయ్యే అవకాశముందని న్యాయవాదుల వర్గాలు భావిస్తున్నాయి.

# ఈ గేమ్ ఆడినవాళ్లు ఆత్మహత్య చేసుకుంటారట! - మీ పిల్లల ఫోన్ చెక్ చేయండి

## - గజియాబాద్‌లో ముగ్గురి ఆత్మహత్యకు ఆన్‌లైన్ గేమ్ కారణమని అనుమానాలు! - పిల్లలు ఏం ఆడుతున్నారో చెక్ చేయాలంటున్న నిపుణులు



ఉత్తర ప్రదేశ్‌లోని గజియాబాద్‌లో ముగ్గురు అక్కాచెల్లెళ్లు బిల్డింగ్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆన్‌లైన్ గేమ్ కు బానిసగా మారి, ఈ దారుణానికి ఒడిగట్టారని తేలడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో చాలా తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు అన్ని ఇళ్లలోనూ పిల్లలు ఫోన్ లో గేమ్స్ ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలు ఎలాంటి ఆటలు ఆడుతున్నారో చెక్ చేయాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రెండున్నరేళ్లుగా!

గజియాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న ముగ్గురు అక్కాచెల్లెళ్లు రెండున్నర సంవత్సరాలుగా ఆన్ లైన్ గేమ్స్ ఆడుతున్నట్టు వారి తండ్రి మీడియాకు తెలిపారు. ఈ గ్యాప్‌లో క్రమంగా కుటుంబానికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ఫోన్ పట్టుకొని తమ రూమ్‌లోనే ఉండేవారట! ఈ ముగ్గురిలో ఒకరు ఇన్‌స్ట్రక్టర్‌గా ఉండేవారని, మిగిలిన ఇద్దరు ఆదేశాలు పాటించేవారని, వారి ఫోన్ లో ఉండే గేమ్ ఆఖరి టాస్క్ "సూసైడ్" అని ఉందని పోలీసు అధికారులు చెప్పినట్టు తండ్రి తెలిపారు.

"కొరియన్ బ్లూవేల్"!

కొరియాకు చెందిన ఓ యాప్ ద్వారా ఈ గేమ్ ఆడినట్టు సమాచారం. ఈ గేమ్‌తో ముగ్గురు అమ్మాయిలు సూసైడ్ చేసుకున్నట్టు తేలడంతో రష్యాకు చెందిన బ్లూవేల్ గేమ్ మరోసారి చర్చలోకి వచ్చింది. 2015లో రష్యాకు టీనేజర్ సూసైడ్ చేసుకోవడంతో బ్లూ వేల్ గేమ్ గురించి ప్రపంచానికి తెలిసింది. రెండేళ్ల క్రితం అమెరికాలో ఓ భారతీయ విద్యార్థి చనిపోయాడు. అతను బ్లూ వేల్ గేమ్ ఆడటం వల్లనే మరణించి ఉంటాడని అక్కడి అధికారులు అనుమానించారు.

గేమ్ ఎలా ఉంటుంది

బ్లూ వేల్ గేమ్ దాదాపు 50 రోజులు కొనసాగుతుంది. దీన్ని ఆడేవారు ఒక సీక్రెట్ ఆన్‌లైన్ గ్రూప్‌లోకి ఎంటర్ అవుతారు. దీన్ని రన్ చేసే వారు ప్లేయర్లకు రోజూ ఒక టాస్క్ ఇస్తారట. అర్ధరాత్రి నిద్ర లేవడం, భయపెట్టే దృశ్యాలు చూపించడం వంటివి చేస్తారట. ఈ టాస్క్‌లు రోజు రోజుకూ తీవ్రత పెరుగుతూ వస్తాయట. రోజూ టాస్క్ కంప్లీట్ చేసిన అనంతరం ఫొటో లేదా వీడియో తీసి ప్రూఫ్ పంపించాలట. ఈ గేమ్ రన్ చేసే మాస్టర్ ఆటగాళ్లను మోటివేట్ చేస్తూ తన కంట్రోల్ లోకి తెచ్చుకుంటాడట. అలా రోజు రోజుకూ డేంజర్ టాస్కులు పెంచుతూ, 50వ రోజు ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపిస్తాడట.

ఎందుకు ఆపేయలేరు

"గేమ్ మధ్యలో ఆపేయొచ్చు కదా" అని మనకు అనిపిస్తుంది. కానీ, అదొక మాయా వలయంగా తయారవుతుందట. మొదట్లో గేమ్ ప్రమాదకరంగా అనిపించదు. ఆడేవాళ్లు దాన్నొక ఛాలెంజ్ గా తీసుకుంటారు. సగం రోజులు గడిచే దాకా అది తీవ్రమైన గేమ్ అనే విషయం అర్థం కాదట! ఇది తెలిసిన తర్వాత కూడా బయటకు రాలేరని మానసిక నిపుణులు చెబుతున్నారు. దాని తాలూకు ఆలోచనలు ఆపలేక మళ్లీ ఆట కొనసాగిస్తారట. ఒకవేళ ఎవరైనా బయటకు రావాలని ప్రయత్నిస్తే గేమ్ మాస్టర్ బెదిరిస్తాడట. ఫోన్ నెంబర్ మొదలు, పర్సనల్ సమాచారం ముందే సేకరిస్తారు కాబట్టి, కుటుంబ సభ్యులకు హాని చేస్తామని బెదిరిస్తాడట. దాంతోపాటు కొన్ని రోజుల్లో గేమ్ అయిపోతుంది. పూర్తి చెయ్ అంటూ మోటివేట్ చేస్తాడట!

కొరియన్ గేమ్ కూడా!

గజియాబాద్ లో ఆత్మహత్య చేసుకున్న పిల్లలు కూడా బ్లూవేల్ లాంటి ఆటనే ఆడి ఉంటారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకా ఎంత మంది ఇలాంటి గేమ్స్ ఆడుతున్నారో తెలియదు. అందుకే తల్లిదండ్రులు తప్పకుండా పిల్లల ఆన్ లైన్ గేమ్స్ పై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెడుతున్నారనేది కూడా చూడాలని, వారి వ్యవహార శైలిని కూడా అబ్జర్వ్ చేయాలని చెబుతున్నారు. వాళ్లు ముభావంగా ఉండడం, నిత్యం బాధలో ఉండటం వంటివి చేస్తుంటే ప్రేమగా మాట్లాడి విషయం తెలుసుకోవాలని సూచిస్తున్నారు. పిల్లలతో సమయం గడపడం ద్వారా ఇలాంటి ప్రమాదాల్లో చిక్కుకోకుండా కాపాడుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# భారత్‌లో హెలికాప్టర్ల తయారీ- అదానీ, లియోనార్డో మధ్య కీలక ఒప్పందం

## అదానీ గ్రూప్, ఇటాలియన్ కంపెనీ లియోనార్డో మధ్య కీలక ఒప్పందం- భారత్ లో హెలికాప్టర్ల తయారీ కేంద్రం ఏర్పాటుకు సన్నద్ధం!



భారత్‌లో సమీకృత హెలికాప్టర్ తయారీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అదానీ గ్రూప్, ఇటలీకి చెందిన ప్రముఖ రక్షణ రంగ సంస్థ లియోనార్డో కీలక ఒప్పందం చేసుకున్నట్లు మంగళవారం ప్రకటించాయి. మేక్ ఇండియా ప్రయత్నాలకు, దేశాన్ని మరింత స్వయంసమృద్ధిగా మార్చడానికి ఇది గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా దేశ సైనిక అవసరాలకు అనుగుణంగా హెలికాప్టర్ల ఉత్పత్తిలో భారత్ స్వావలంబన పెంచడానికి ఇది ఉపయోగపడనుంది. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, లియోనార్డో సంస్థలు మంగళవారం దిల్లీలో ఈ అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకాలు చేశాయి. భారత సాయుధ దళాల అవసరాలు తీర్చడమే కాకుండా, హెలికాప్టర్ల ఉత్పత్తిలో భారత్‌ను స్వయంసమృద్ధ దేశంగా మార్చడమే ఈ ఒప్పందం లక్ష్యంగా తెలుస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం, "ఈ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం వల్ల లియోనార్డోకు చెందిన అత్యాధునిక ూఔ169వీ, ూఔ109 ుతీవనిఎవతీవీ హెలికాప్టర్లు భారత్‌లో తయారు చేస్తారు. దీని వల్ల భారత సైనిక అవసరాలకు అంతర్జాతీయ స్థాయి సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. అయితే ఇది కేవలం తయారీకే పరిమితం కాకుండా, దశల వారీగా స్వదేశీకరణ (ఇండియనైజేషన్), పటిష్టమైన నిర్వహణ, మరమ్మతులు, ఓవర్ హాలింగ్ సామర్థ్యాలతో పాటు, పైలట్లకు సమగ్ర శిక్షణను కూడా అందిస్తుంది."

ఏటా 100 హెలికాప్టర్లు తయారీ!

భారత జనాభాతో పోల్చితే హెలికాప్టర్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. (జనాభా నిష్పత్తి ప్రకారం 250 కంటే తక్కువ హెలికాప్టర్లు ఉన్నాయి.) ఈ లోటును తీర్చేందుకు రానున్న 10 ఏళ్లలో ఏటా సుమారు 100 హెలికాప్టర్లు అవసరం ఉంటుందని అంచనా. అందుకే "దేశ పౌర, రక్షణ అవసరాలు తీర్చే సమీకృత హెలికాప్టర్ తయారీ వ్యవస్థకు పునాది వేస్తున్నాం. తయారీ, అసెంబ్లింగ్, శిక్షణను ఒకే చోటకు చేర్చి, అంతర్జాతీయ స్థాయి మద్దతును భారత్ గడ్డపై ఇస్తాం" అని అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ డైరెక్టర్ జీత్ అదానీ తెలిపారు. "రానున్న దశాబ్దంలో భారత సైన్యానికి 1000 కంటే ఎక్కువ హెలికాప్టర్లు అవసరం అవుతాయి. కనుక అదానీ, లియోనార్డో ఒప్పందం దేశీయ తయారీ కలను సాకారం చేస్తుంది."'భారత్ ఒక పెద్ద మార్కెట్, ఇక్కడి సైనిక దళాల అవసరాలు తీర్చడానికి మేము సిద్ధంగా ఉన్నాం' అని లియోనార్డో హెలికాప్టర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జియాన్ పియరో కుటిల్లో చెప్పారు. గత వారం అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, బ్రెజిల్ దిగ్గజం ఎంబ్రేయర్ (జుఎఎతీఖవతీ)తో కలిసి ప్రాంతీయ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటుకు కీలక ఒప్పందం చేసుకుంది. తాజాగా లియోనార్డోతో హెలికాప్టర్ల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇది ఈ రంగంలో అదానీ సంస్థల దూకుడును సూచిస్తోంది. భారత్ నమ్మకమైన భాగస్వామిభారత్ లోని ఇటలీ రాయబారి ఆంటోనియో ఎన్రికో బార్టోలి ఈ ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. రక్షణ రంగంలని ఇద్దరు గ్లోబల్ ఛాంపియన్లు నేడు కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నారని ఆయన కొనియాడారు. "రక్షణ రంగంలో భారత్ ఇటలీకి ఒక నమ్మకమైన, దీర్ఘకాలిక భాగస్వామి. హెలికాప్టర్ విభాగంలో లియోనార్డో అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉంది. మేము ఇటలీలో మరిన్ని భారత పెట్టుబడులను ఆశిస్తున్నాం. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్ టీఏ) కేవలం వాణిజ్యం గురించి మాత్రమే కాదు. ఇది మన ఉమ్మడి విలువలు, భద్రతకు సంబంధించింది" అని అన్నారు. "అదానీ డిఫెన్స్, లియోనార్డో మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) అత్యంతకీలకమైనది. గత వారమే గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో ఎఫ్ టీఏ జరిగింది. ఆ సమయంలో రక్షణ, భద్రతా భాగస్వామ్యంతో సహా 3 ఒప్పందాలు కుదిరాయి. ఆత్మ నిర్భర్ భారత్ విజన్‌తో, మేము దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడమే కాకుండా, దేశంలోనే పోటీతత్వ పారిశ్రామిక సామర్థ్యాన్ని నిర్మించాలని అనుకుంటున్నాం" అని రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ అన్నారు.

### హెయిల్ టాటామణి చారిటబుల్

## ట్రస్ట్ ఆధ్వర్యం టైలరింగ్ సర్టిఫికెట్స్ పంపిణీ...



చిట్యాల//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : హెయిల్ టాటామణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో నల్గొండ జిల్లా చిట్యాల పట్టణం లో , టైలరింగ్ నేర్చుకున్న (100) వంద మంది మహిళా మణులకి చారిటబుల్ ట్రస్ట్ తరఫునుంచి టైలరింగ్ సర్టిఫికెట్స్ పంపిణీ చేసారు. ఈకార్యక్రమం చిట్యాల న్యూ మున్సిపల్ చైర్మన్ పందిరి గీత , శ్రీలత, షరీఫ్ ఉన్నిసా సమక్షంలో జరిగినది. ఈ కార్యక్రమ లో హెయిల్ టాటామణి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్,చైర్మన్ సీఈవో, డాక్టర్ కాకుమాను లూర్దు జ్యోతి చారిటీ మెంబర్స్ పోలంకి జగదీష్ కుమార్, ఎం మురళి, జి శశి కుమారి, జి రాజు, బి హేమలత, ఎం సావిత్రి,పి కవిత, జ.జోస్ఫిన్ తదితరులు పాల్గొన్నారు.

### తెలుగు భాష దినోత్సవ సందర్భంగా

## వీర బొమ్మ రమేష్ కు ఘన సన్మానం..



హైద్రాబాద్//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : తెలుగు భాష దినోత్సవ సందర్భంగా ప్రముఖ సామాజిక వేత్త ఆదిలీల ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర చెర్మెన్ వీరబొమ్మ రమేష్ ను ఘనంగా సన్మానించారు. రవీంద్రభారతిలో జరిగిన మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ బిసి కమిషన్ చెర్మెన్ వకులా భరణం కృష్ణ మోహన్ రావు చేతుల మీదుగా సత్కరించడం జరిగింది .ఈ కార్యక్రమం లో ఆదిలీల ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ ఆదినారాయణ పాల్గొన్నారు

## రేషన్ బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు...

### పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర...



హైదరాబాద్//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : పేద ప్రజలు కూడా సంపన్నులతో సమానంగా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి మరియు ఎక్స్-అఫిషియో కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, తెలిపారు. బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని ఆయన అధికారులను కఠినంగా ఆదేశించారు. హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటలపాటు గోదాములో నిల్వ ఉన్న బియ్యం సంచులను యాదృచ్ఛికంగా తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యం లో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని గోదాం ఇన్‌చార్జీలకు సూచించారు. ఈ విషయంలో ఏం మాత్రం రాచి పడిన కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతి బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు.సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్‌అవుట్‌వర్డ్ వివరాలు, రవాణా రికార్డులను కమిషనర్ పరిశీలించారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గోదాములో పని చేస్తున్న హమాలీలతో మాట్లాడిన కమిషనర్ గారు వారి పనివాతావరణం, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు."ప్రజల విశ్వాసమే మా బలం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నాణ్యతే ప్రమాణం కావాలి. రేషన్ బియ్యం విషయంలో చిన్న తప్పిదం కూడా సహించము," అని కమిషనర్ గారు స్పష్టం చేశారు. ఈ తనిఖీ లో హైదరాబాద్ జిల్లా మేనేజర్ కె. సాయి అరుణ్, అదనపు జిల్లా మేనేజర్ దీప్తి, గోదాం ఇన్‌చార్జీలు గోపాలకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం...

### పెళ్లికి సహాయం అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు...

### వి.ఎస్.ఎస్.ఎస్ ఫౌండర్ అండ్ చైర్మన్ డా,సురభి శ్రీధర్....




గోదావరిఖని టౌన్//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : పెద్దపల్లి జిల్లా రామగుండం హౌసింగ్ బోర్డు కాలనీ కి చెందిన గున్నాల రమ - శ్రీనివాస్ దంపతుల ప్రధమ పుత్రిక వివాహం రామగుండం పెద్దంపేట్ ప్రాంతానికి చెందిన యువకునితో ఈ నెల 22న, ఉదయం 10 గంటల 41 నిమిషాలకి నిశ్చయముగా,పెండ్లి ఖర్చులకోసం అమ్మాయి తల్లిదండ్రులు దాతల సహకారం కోసం వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్.సురభి శ్రీధర్ కోరగా తన వంతు సహాయముగా దాతల సహకారంతో కొంత ఆర్థిక సాయం అందించడం జరిగింది.శనివారం గోదావరిఖని తిలక్ నగర్ ప్రాంతానికి చెందిన సంస్థ ఆర్గనైజర్ ఏకు సమ్మయ్య -రాజకుమారి దంపతులతో పాటు వాళ్ళ కుమారుడు ఏకు అరవింద్ అమ్మాయి వాళ్ళ కుటుంబ సభ్యులకు 25 కేజీల బియ్యం అందించడం జరిగింది. అనంతరం సురభి శ్రీధర్ మాట్లాడారు.వెలుగు సామాజిక స్వచ్ఛ సంస్థ చేస్తున్న కార్యక్రమాలలో తమ సంస్థ ఆర్గనైజర్లు తమ వంతు సహాయ సహకారాలుగా సహాయ చేయడం జరుగుతుందని తెలిపారు.ఆడబిడ్డ పెళ్లికి సహాయం అందించాలని కోరగానే సహాయం అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదములు తెలుపుకుంటున్నానని సురభి శ్రీధర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయముగా నిస్సహాయులకు, నిర్భాగ్యులకు,పేదింటి అమ్మాయిల పెళ్లిళ్లకు సహాయం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రవి,అమ్మాయి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వాలన్నదే తమ ఉద్దేశం...

### వారానికి ఒకసారి మండలానికి,

### గ్రామానికి స్వచ్ఛ రథం...

### ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

### నారా చంద్రబాబు నాయుడు...



అమరావతి//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : వారానికి ఒకసారి మండలానికి, గ్రామానికి స్వచ్ఛ రథం వస్తుందని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారని అన్నారు. పల్నాడు జిల్లా- వినుకొండలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు మీకు ఆదాయం వస్తుందని, 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వాలన్నదే తమ ఉద్దేశం అని.. అందుకే ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో పాల్గొంటానని అన్నారు. విశాఖలో చెత్త నుంచి కరెంటు తయారు చేస్తున్నారని, మరో ఐదు ప్లాంట్ల ద్వారా కరెంటు తయారు చేస్తామని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రాష్ట్రంలో బ్యాన్ చేశామని చెప్పారు. మార్చి 31 కల్లా వందశాతం ఇంటినుంచి చెత్త సేకరించేలా చేస్తామని, చెత్త ద్వారా మళ్లీ వస్తువుల ఉత్పత్తులు చేస్తామని సిఎం పేర్కొన్నారు. టెక్నాలజీ వినియోగంలో మనమే నెంబర్ వన్ అని..వ్యవసాయంలోనూ ఎఐ సేవలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. ఎన్ డిఎ కూటమి రాష్ట్రంలో పెను మార్పులు తీసుకురాబోతుందని, సూపర్ సిక్స్..సూపర్ హిట్ చేశామని తెలియజేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా చేస్తామని, స్త్రీశక్తి, దీపం పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. పేదల ఆదాయం పెంచేందుకు పి4 పథకం ఉందని, టెక్నాలజీ వినియోగాన్ని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ మెచ్చుకున్నారని అన్నారు. పల్నాడు అంటే పౌరుషాల గడ్డ అని.. పల్నాడు వస్తే వైబ్రేషన్స్ వస్తాయని, శివరాత్రి అంటే కోటప్పకొండ ప్రభలు ప్రత్యేకం అని కొనియాడారు. ఎఐ సదస్సులో కాంగ్రెస్ తీరు ఆవవేదన కలిగించిందని, కాంగ్రెస్ తీరు దేశానికి మంచిది కాదని సూచించారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనించాలని, దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని కోరారు. కొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇదో చేదు అనుభవం.. గుణపాఠం నేర్చుకుంటాం: ఆసీస్ కెప్టెన్ రెచ్చగొట్టే పనులు చేస్తున్నారని, తప్పులు చేసిన వాళ్ల అఘాయిత్యం చేసుకునే పరిస్థితి వస్తుందని మండిపడ్డారు. అసెంబ్లీలో తన సతీమణిని కూడా అవమానించారని, 23 క్లేమోర్ మైన్స్ ప్రయోగించినా తాను భయపడనని అన్నారు. వెంకటేశ్వరస్వామి స్వయంగా తనను కాపాడారని, వెంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. మాజీ మంత్రి, దివంగత నేత వైఎస్ వివేకానంద రెడ్డి హత్యను గుండె పోటు అని నమ్మించే ప్రయత్నం చేశారని, నారాసుర రక్త చరిత్ర అంటూ తనపై నెపం నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య చుట్టూ నాటకాల రాయుడు నాటకాలు ఆడారని, ఇప్పుడు కూడా లడ్డూ కల్తీ చేసి హెరిటేజ్ పేరు తీసుకొస్తున్నారని ధ్వజమెత్తారు. తాను ప్రాణం పోయినా తప్పు చేయనని, లడ్డూ ప్రసాదానికి వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పిందని తెలిపారు. తప్పు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని, తప్పును పక్కన వాళ్లపై నెట్టే నీచులు కూడా ఉన్నారని, నేరగాళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు నాయుడు హితవు పలికారు.

## చదువుపై దృష్టి పెట్టాలని సర్పంచ్ సతీష్ పిలుపు...



ఓదెల//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని ఓదెల ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం తల్లిదండ్రుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.విద్యార్థులు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తరువాత టీవీ, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, రోజువారీ పాఠాలు పునర్విమర్శ చేసుకునే అలవాటు పెంపొందించాలని సూచించారు. విద్యార్థులు పూర్తి ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ, ఉపాధ్యాయురాలు శోభారాణి మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాస పురోగతిపై తల్లిదండ్రులు తరచూ ఉపాధ్యాయులతో సంప్రదించాలని కోరారు. విద్యార్థుల హాజరు, చదువు అలవాట్లు, పరీక్షల సిద్ధతపై సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, ఉప సర్పంచ్ శ్రీలత, వార్డు సభ్యులు సదానందం, విద్యార్థుల తల్లిదండ్రులు విజయలక్ష్మి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థుల భవిష్యత్తు కోసం సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన తహసీల్దార్ ఎం స్వప్న...



జడ్చర్ల//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : జడ్చర్ల జిల్లా మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను శనివారం మిడ్జిల్ మండల తహసీల్దార్ ఎం స్వప్న ప్రత్యక్షంగా పరిశీలించారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం నిర్మాణం పూర్తి అయిన ఈ ఇళ్లను ఇప్పటికీ లబ్ధిదారులకు అందజేయకపోవడంతో గ్రామ ప్రజల్లో అసంతృప్తి నెలకొన్న నేపథ్యంలో అధికారులు స్థల పరిశీలన చేపట్టారు.ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం స్వప్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోని మౌలిక వసతుల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా ఇళ్లలో విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయం, డ్రైనేజ్ వ్యవస్థ, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలపై దృష్టి సారించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణంలో ఉన్న లోపాలను గుర్తించి వాటిని తక్షణమే సరిదిద్దాలని ఆదేశించారు.గ్రామ ప్రజలు కూడా ఈ సందర్భంగా తమ సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు సిద్ధంగా ఉన్నప్పటికీ మౌలిక సదుపాయాలు పూర్తిగా అందుబాటులో లేని కారణంగా ఇప్పటి వరకు ఇళ్ల కేటాయింపు జరగలేదని వారు పేర్కొన్నారు. ఈ సమస్యలను త్వరగా పరిష్కరించి లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలని ప్రజలు కోరారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ అంబికా వసంతతో పాటు గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. తహసీల్దార్ ఎం స్వప్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## దేశంలో అర్హత లేని 32 ఫేక్ యూనివర్సిటీలు...

### గుర్తించిన యూజీసీ... తాజాగా ఫేక్ యూనివర్సిటీల జాబితాను విడుదల...




హైదరాబాద్//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : దేశంలో అర్హత లేని ఫేక్ యూనివర్సిటీలు 32 ఉన్నట్లు యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) గుర్తించింది. ఫేక్ యూనివర్సిటీల జాబితాను తాజాగా విడుదల చేసింది. వీటిలో చదివే, చదవాలనుకునే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని యూజీసీ హెచ్చరించింది. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని, ఉన్నత విద్యా విభాగం ఆధ్వర్యంలో పని చేసే యూజీసీ.. దేశంలో కొనసాగుతున్న యూనివర్సిటీల అర్హతలపై సమీక్ష చేస్తుంది.తనిఖీలు నిర్వహించి.. తగిన అర్హతలుంటే అనుమతులివ్వడం లేదంటే నిరాకరించడం, బ్లాక్ లిస్టులో పెట్టడం వంటివి చేస్తుంది. ప్రతి ఏటా అలా అర్హత లేని యూనివర్సిటీలను గుర్తించి, నోటీసులు జారీ చేస్తుంటుంది. విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంది. దీనిలో భాగంగా తాజాగా దేశంలో 32 యూనివర్సిటీలు ఫేక్ అని వెల్లడించింది. యూజీసీ యాక్ట్ ప్రకారం ఈ యూనివర్సిటీలు ఇచ్చే డిగ్రీలు, పీజీలు వంటివి చెల్లవు. వాటికి చట్టబద్ధత లేదు. అంటే ఆ యూనివర్సిటీలు జారీ చేసే సర్టిఫికెట్లు ఎందుకూ పనికిరావు. ఇలాంటి యూనివర్సిటీల్లో ఢిల్లీ టాప్‌లో ఉంది. ఇక్కడ 12 యూనివర్సిటీలు ఫేక్ అని తేలింది.ఏపీలో గుంటూరులోని క్రిస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, విశాఖపట్నంలోని బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా అనే యూనివర్సిటీలు ఫేక్ అని వెల్లడించింది. తాజా జాబితాకు సంబంధించి రాష్ట్రాల వారిగా ఫేక్ యూనివర్సిటీలు ఇలా ఉన్నాయి. ఢిల్లీలో 12, యూపీలో 4, ఏపీలో 2, కర్ణాటకలో 2, కేరళలో 2, మహారాష్ట్రలో 2, పుదుచ్చేరిలో 2, పశ్చిమ బెంగాల్‌లో 2, అరుణాచల్ ప్రదేశ్‌లో 1, హరియాణాలో 1, ఝార్ఖండ్‌లో 1, రాజస్థాన్‌లో 1 చొప్పున యూనివర్సిటీలు ఫేక్ అని తేలింది.

## ఎంపి ఈటల రాజేందర్ హౌస్ అరెస్ట్...



హైదరాబాద్/ఫిబ్రవరి 21 ఆకాంక్ష : కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి ఇంటిమీద దాడి నేపథ్యంలో ఆయన్ను పరామర్శించేందుకు కామారెడ్డి బయలు దేరిన ఈటల రాజేందర్ ను అడ్డుకున్న పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఏసీపీతో సహ పెద్దయెత్తున ఈటల నివాసానికి పోలీసులు చేరుకుననేరు. ప్రభుత్వ వైఖరిని, పాలీసుల తీరును తీవ్రంగా ఖండించిన ఈటల రాజేందర్, గుండాయిజం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని ఈటెలహెచ్చరించారు. -ఎమ్మెల్యేకే రక్షణ లేకపోతే ఇక సామాన్య ప్రజలకు ఏం రక్షణ కల్పిస్తారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. - -ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులను ప్రజలు సహించరు. హింసను క్షమించరు. - కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ బలపడడం జీర్ణించుకోలేకే ఇలాంటి దాడులు చేస్తున్నారు. - కాంగ్రెస్ నాయకుల రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఈ విధమైన దాడులకు పాల్పడటం అత్యంత దుర్మార్గం.- దీనికి పూర్తి భాద్యత సీఎం రేవంత్ రెడ్డి వహించాలి. - మేము వెంకటరమణ రెడ్డి గారికి, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పూర్తి అండగా ఉంటాము.

### బీఎస్పీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి

## పరామర్శకు బృందం సిద్ధం....

నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : నాగర్ కర్నూల్ మండలంలోని కుమ్మెర జాతర సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణలో రెండు నెలల చిన్నారి గాయాలతో మృతి చెందిన ఘటనపై బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని బీఎస్పీ జిల్లా నాయకుడు పృథ్వీరాజ్ శనివారం పేర్కొన్నారు. జాతర సందర్భంగా గ్రామానికి చెందిన చిల్కేశ్వరం గణేష్ మరియు ఇతరులతో జరిగిన ఘర్షణలో చిన్నారి తీవ్రంగా గాయపడినట్లు, అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. ఈ దారుణ ఘటనపై బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం వెళ్లనుందని వెల్లడించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులపై చేసిన దాడి శోచనీయమని ఆయన విమర్శించారు. ఈ దాడిలో చిన్నారి ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీఎస్పీ డిమాండ్ చేసింది.జాతరల సమయంలో భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు కోరారు.

## వలస కార్మికుల దుస్థితిపై జడ్జి ఆగ్రహం....

### వారంలోగా సౌకర్యాలు కల్పించక పోతే కఠిన చర్యలు...



పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ ఇటుక బట్టీలో వలస కార్మికుల దుస్థితి బయటపడింది. కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్న ఫిర్యాదులపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధికారి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వి. భవాని శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా అక్కడి పరిస్థితులు చూసి జడ్జి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.ఇటుక బట్టీలోని నివాస ప్రాంతాల్లో పారిశుధ్యం అత్యంత అధ్వాన్నంగా ఉండడం, స్త్రీలు, పురుషులకు వేర్వేరు మరుగు దొడ్లు లేకపోవడం, గదుల్లో గాలి, వెలుతురు లేకపోవడం వంటి సమస్యలను ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. వలస కార్మికులు నివసిస్తున్న గదుల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడం అమానవీయమని వ్యాఖ్యానించారు. తనిఖీ సందర్భంగా జడ్జి భవాని కార్మికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, నివాస ఏర్పాట్లు, భద్రతా చర్యలు వంటి అంశాలను పరిశీలించారు. కార్మికులకు చెల్లిస్తున్న కూలీ, పని గంటలు, వారి జీవన పరిస్థితులపై వివరాలు సేకరించారు. వలస కార్మికుల పిల్లల విద్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి, పాఠశాల నిర్వహణలో ఉన్న లోపాలు, ఉపాధ్యాయుల కొరతపై యాజమాన్యాన్ని ప్రశ్నించారు.కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించబోమని జడ్జి భవాని కఠిన హెచ్చరిక జారీ చేశారు.వారం రోజుల్లోగా కార్మికులకు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, తగిన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా మార్పులు చేయకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ తనిఖీతో ఇటుక బట్టీలో వలస కార్మికుల సమస్యలు వెలుగులోకి రావడంతో అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి బట్టీలలో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితులపై సమగ్ర పరిశీలన చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### సీతారాంపురం పాఠశాలలో

## ఘనంగా 7వ తరగతి విద్యార్థుల వీడ్కోలు..





భద్రాచలం//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : దుమ్ముగూడెం మండలంలోని సీతారాంపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం 7వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. విద్యార్థుల భవిష్యత్ విజయాలను ఆకాంక్షిస్తూ ఉపాధ్యాయులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోలెం సుజాత మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రతి ఒక్కరు సమాజానికి ఉపయోగపడే బాధ్యతగల పౌరులుగా ఎదగాలని, చదువుతో పాటు విలువలను కూడా అలవర్చుకోవాలని ఆమె ప్రేరణాత్మకంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గతంలో ఇదే పాఠశాలలో సేవలందించి ఉద్యోగోన్నతిపై ఇతర పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయుడు వరప్రసాద్ సార్ని శాలువాతో సత్కరించారు. అనంతరం వరప్రసాద్ సార్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, విద్య ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని నిర్ణయించుకొని పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని అందుకోవచ్చని ఆయన సూచించారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి తమ ప్రతిభను ప్రదర్శించారు. పాటలు, నృత్యాలు, నాటికలతో సభను అలరించి అందరి ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి వారి భవిష్యత్ జీవితానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాతతో పాటు ఉపాధ్యాయులు సునీత, వరలక్ష్మి, శ్రీనివాస్, చిన్నక్క తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో పాఠశాల వాతావరణం ఉత్సాహభరితంగా మారింది.

### సమిష్టిగా క్షయ వ్యాధి అంతం దిశగా

## పాలెం గ్రామంలో అవగాహన శిబిరం...



నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 21 (ఆకాంక్ష) : సమిష్టి కృషితోనే క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని బిజినేపల్లి మండలం పాలెం గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం మరియు భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పాలెం గ్రామపంచాయతీ ప్రాంగణంలో నిర్వహించిన క్షయ వ్యాధి గుర్తింపు, అవగాహన శిబిరంలో ఆయన ప్రధాన అతిథిగా పాల్గొని గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ, క్షయ వ్యాధి నిర్మూలన ఒక్కరితో సాధ్యం కాదని, సమిష్టిగా ముందుకు సాగితేనే వ్యాధిని అరికట్టగలమని తెలిపారు. అవగాహన, చైతన్యం ఉంటేనే క్షయ వ్యాధిపై విజయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పాలెం గ్రామం ఇప్పటికే 100 శాతం అక్షరాస్యత సాధించిందని, ప్రతి కుటుంబంలో ఆరోగ్యంపై అవగాహన పెంచుతూ, పిల్లలకు వ్యాధుల తీవ్రతను వివరించాలని సూచించారు. ఒక వ్యక్తి నుంచి మరో 15 మందికి వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని హెచ్చరిస్తూ, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పిలుపు నిచ్చారు. మద్యపానం, ధూమపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని సూచించారు. శిబిరంలో మొత్తం 110 మందికి ఛాతి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించగా, అందులో 14 మందిలో వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించి వారి నుంచి కఫ నమూనాలు సేకరించారు. అదనంగా హాజరైన ప్రజలకు హెచ్ఐవి, లైంగిక వ్యాధులు, మధుమేహం వంటి పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోవిందు శ్రీనివాసులు, పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, భవిష్య భారత్ డాక్టర్ దీప్తి, గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు, ఎంపిహెచ్ఈఓ రాజేశ్వర్, సూపర్వైజర్లు సుజాత, శ్రీనివాసులు, శ్రవణ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఏఎన్ఎం గజవర్ధనమ్మ, టెక్నీషియన్లు అమన్, వీరేష్, ఆశా కార్యకర్తలు జయమ్మ, పార్వతి, విజయలీల, వరలక్ష్మి, షమీం తదితరులు పాల్గొన్నారు.



### అంగన్వాడీల హక్కుల కోసం పోరాట ఘంటికలు

### 23 నుండి ఎమ్మార్వో కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు.



వెల్దుర్తి// ఫిబ్రవరి 21 (ఆకాంక్ష) : అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మరోసారి పోరాట పంథాను ఎంచుకున్నారు. కనీస వేతనంగా రూ.26,000 చెల్లించాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, సమ్మె సమయంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23 నుండి 27వ తేదీ వరకు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈ దీక్షలు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వెల్దుర్తి ప్రాజెక్ట్ కార్యాలయంలో సీడీపీఓ లుక్, సూపర్వైజర్ పద్మావతి కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జె. లలితమ్మ, కర్నూలు జిల్లా అధ్యక్షురాలు చాందిని, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బి. మాధవస్వామి, అంగన్వాడి కార్యకర్తలు ఈదమ్మ, విజయ్ కుమారి, ఎఫ్సిబా, సుమలత, సరస్వతి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీల సేవలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు వెన్నెముక వంటివని, అయితే వారికి తగిన గుర్తింపు, గౌరవ వేతనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## మీడియా ప్రతినిధులకు కీలక ప్రకటన...

### జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటుకు చర్యలు..

నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 21 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలో మీడియా ప్రతినిధులకు 202628 సంవత్సరాల కాలానికి కొత్త అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించేందుకు జిల్లా పౌర సంబంధాల శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో నూతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఐపీఆజ) ఏర్పాటుకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి వెల్లడించారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఐపీఆజ)లో సభ్యత్వం కోసం ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 252 ప్రకారం జిల్లాలోని మీడియా అసోసియేషన్లు, సంఘాలు తమ ప్రతినిధుల పేర్లను అధికారిక లెటర్ ప్యాడ్‌పై రాసి ఫిబ్రవరి 23 ఉదయం 11 గంటల లోపు జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి అందజేయాలని కోరారు. డీమక్ కమిటీలో సభ్యులుగా ఉండే ప్రతినిధుల కేటగిరీలు ఈ విధంగా ఉంటాయని తెలిపారు. బిగ్ తెలుగు డైలీ నుండి ఒక ప్రతినిధి, ఉర్దూ డైలీ నుండి ఒక ప్రతినిధి, మీడియం డైలీ నుండి ఒక ప్రతినిధి, స్మాల్ డైలీ నుండి ఒక ప్రతినిధి, ఎలక్ట్రానిక్ మీడియా నుండి ఒక ప్రతినిధి, వీడియో జర్నలిస్ట్ నుండి ఒక ప్రతినిధి, ఫోటో జర్నలిస్ట్ నుండి ఒక ప్రతినిధి ఉండాలని సూచించారు. పై ప్రతినిధులు ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 252లోని రూల్ 3, సబ్ రూల్ 1(సి) ప్రకారం పూర్తి కాల జర్నలిస్టులు అయి ఉండాలని స్పష్టం చేశారు. అదేవిధంగా బిగ్ డైలీ ప్రతినిధి మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధికి కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలని, మిగిలిన ప్రతినిధులకు కనీసం 5 సంవత్సరాల మీడియా రంగ అనుభవం తప్పనిసరి అని పేర్కొన్నారు. జిల్లాలోని మీడియా సంఘాలు తమ ప్రతినిధుల పేర్లను ఫిబ్రవరి 23 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, నాగర్ కర్నూల్ వద్ద అందజేయాలని అధికారులు సూచించారు. గడువు తర్వాత వచ్చే ప్రతిపాదనలను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ ద్వారా జిల్లాలో మీడియా ప్రతినిధులకు పారదర్శకంగా అక్రిడిటేషన్ జారీ చేసి, జర్నలిస్టులకు ప్రభుత్వ పథకాలు, అధికారిక కార్యక్రమాలకు మరింత సౌలభ్యం కల్పించడమే లక్ష్యమని జిల్లా పౌర సంబంధాల శాఖ పేర్కొంది.

### శనేశ్వర స్వామికి ఘనంగా తిలతైల అభిషేక పూజలు...



నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 21 (ఆకాంక్ష) : శ్రీ విశ్వవసు సంవత్సరం ఫాల్గుణ మాసం శుక్ల పక్షం చవితి శనివారం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీ శనేశ్వర స్వామి ఆలయంలో శని గ్రహ దోష నివారణార్థం తిలతైల అభిషేక పూజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు కొనసాగగా, భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శ్రీ శనేశ్వర స్వామికి ప్రత్యేకంగా తిలతైలాభిషేకాలు, అర్చనలు నిర్వహించగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఫాల్గుణ మాసంలో స్వామివారిని భక్తి విశ్వాసాలతో కొలిచిన వారికి విశేష ఫలితాలు లభిస్తాయని తెలిపారు. జన్మ రీత్యా, గోచార రీత్యా శని గ్రహ దోషాల నివారణ కోసం ప్రతి ఒక్కరు శక్తి మేరకు స్వామివారిని పూజించాలని సూచించారు. అలాగే ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి రుద్రాభిషేకాలు, అర్చనలు, దీపారాధనలు నిర్వహించగా, నందీశ్వర స్వామికి ప్రత్యేక అర్చనలు జరిపారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి. సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీరశేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమామహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి తదితరులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామీణ బాలికల సాధికారతకు కేజీబీవీలు బలమైన వేదికలు...

### అదనపు కలెక్టర్ పి. అమరేందర్...






నాగర్‌కర్నూల్//ఫిబ్రవరి 21 (ఆకాంక్ష) : గ్రామీణ బాలికలకు సమాన విద్యా అవకాశాలు కల్పించాలనే ప్రభుత్వ దృఢ సంకల్పానికి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు) బలమైన వేదికలుగా నిలుస్తున్నాయని జిల్లా అదనపు కలెక్టర్ పి. అమరేందర్ తెలిపారు. బాలికల సాధికారత, నాణ్యమైన విద్య మరియు ఉన్నత లక్ష్యాల సాధనలో కేజీబీవీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ ప్రధాన సమావేశ మందిరంలో ల్యూమినస్ లీగ్ ఆఫ్ కేజీబీవీలు, ప్రేరణ కార్యక్రమం, ఎస్సెస్సీ మరియు ఇంటర్ విద్యార్థుల సన్మానోత్సవం, పూర్వ విద్యార్థులు మరియు ఉత్తమ ఉద్యోగుల సత్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ పి. అమరేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. నిరంతర శ్రమ, పట్టుదల, సమయపాలనతోనే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని చెప్పారు. విద్యార్థి దశలో అలవర్చుకున్న మంచి అలవాట్లు భవిష్యత్తులో గొప్ప విజయాలకు దారితీస్తాయని పేర్కొన్నారు. తల్లి దండ్రులు, గురువుల ఆశలను నెరవేర్చేలా చదువుపై పూర్తి దృష్టి సారించాలని విద్యార్థినులకు సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్ మరియు పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఫలితాల సాధన దిశగా జిల్లా విద్యాశాఖ చర్యలు చేపడుతోందని చెప్పారు. రానున్న ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లాను ఆరో స్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కేజీబీవీల్లో చదివిన పూర్వ విద్యార్థినులు ఎంబీబీఎస్ సహా ఉన్నత విద్యను అభ్యసించి, ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాల్లో ప్రతిష్ఠాత్మక స్థానాలు పొందుతున్నారని పేర్కొన్నారు. కేజీబీవీలు బాలికలకు రక్షణ, ఆరోగ్యం, నాణ్యమైన విద్యా సదుపాయాలు, పోషకాహారం అందిస్తూ సమగ్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయని వివరించారు. కేజీబీవీల పర్యవేక్షణ అధికారిణి శోభారాణి మాట్లాడుతూ జిల్లాలోని 20 కేజీబీవీల్లో విద్యార్థినులకు అందిస్తున్న విద్యా, వసతి, సహ పాఠ్య కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. పూర్వ విద్యార్థినుల విజయాలు ప్రస్తుత విద్యార్థినులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని తెలిపారు. కేజీబీవీల్లో విధులు నిర్వహించే ఉద్యోగస్తుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న వివిధ స్థాయి సిబ్బందిని అదనపు కలెక్టర్ ప్రశంసా పత్రాలతో సత్కరించారు. పూర్వ విద్యార్థుల విజయగాథలు మరియు సిబ్బంది ప్రతిభ కేజీబీవీ విద్యార్థుల అభివృద్ధికి ప్రేరణగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, సమగ్ర శిక్ష అభియాన్ ఫైనాన్స్ అధికారి మధుసూదన్ రెడ్డి, మండల విద్యాధికారులు భాస్కర్ రెడ్డి, త్యాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, సెక్టోరియల్ అధికారులు వెంకటయ్య, నూరుద్దీన్, శోభారాణి, కిరణ్ కుమార్, కేజీబీవీల ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమంపై దృష్టి సారించిన ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం...

### మంత్రి పొన్నం ప్రభాకర్ హామీపై హర్షం వ్యక్తం చేసిన ఉద్యమకారులు...






ఓదెల//ఫిబ్రవరి 21 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ మరియు జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గల్లీ నుండి ఢిల్లీ వరకు జరిగిన తొలి మరియు మలిదశ ఉద్యమాలలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. కేవలం కేసులు నమోదైన వారికే పరిమితం కాకుండా ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపి అనేక ఇబ్బందులు, నష్టాలు ఎదుర్కొన్న ప్రతి ఉద్యమకారుడిని గుర్తించి వారికి తగిన గౌరవం, సహాయం అందించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితేనే మన నీళ్లు, నిధులు, నియామకాలు మనకే దక్కుతాయని నమ్మి దాదాపు పదమూడు సంవత్సరాల పాటు తమ వ్యక్తిగత జీవితాలను పక్కనపెట్టి రాష్ట్ర సాధన కోసం కృషి చేశామని తెలిపారు. ప్రస్తుతం అనేక మంది ఉద్యమకారులు ఆర్థిక, సామాజిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అగ్రనేత్రి సోనియా గాంధీ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు భూమి, పెన్షన్ అందిస్తామని ఇచ్చిన హామీని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజు ఠాకూర్, పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ క్రిష్ణ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ నాయకత్వంలో ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం సంతోషకరమని తెలిపారు. ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద పూర్తి నమ్మకం ఉంచిన ఉద్యమకారులు తక్షణమే చర్యలు తీసుకొని హామీలను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దుబాటి చంద్రకళ, పొత్తు జ్యోతి రెడ్డి, లలిత ఠాకూర్, రాష్ట్ర కార్యదర్శి బత్తుల శంకర్, మాడ నారాయణ రెడ్డి, కందుల సదాశివ, రాష్ట్ర జర్నలిస్టు ఫోరం సురేష్ గౌడ్, ఆర్ఎంపిపిఎంపి పెద్దపెల్లి జిల్లా విభాగం అధ్యక్షులు ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, కందుల అశోక్ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లలిత ఠాగూర్, జిల్లా ఉపాధ్యక్షులు జునుగురి సుధాకర్, మందమంద భాస్కర్, కాల్వల తిరుపతి, జిల్లా కార్యదర్శి చంటి నరసక్క, జిల్లా కోశాధికారి ఆలేటి ఎల్లమ్మ, గట్ల రవీందర్ రెడ్డి, ఉద్యమకారుడు మొలుగూరి నరసయ్య, రూపా ఠాగూర్, గడ్డం లక్ష్మి, పెంచల మల్లయ్య, గుజ్జుల పద్మ, జ్యోతి ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

### డాక్టర్ భీమ్ భరత్‌కు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రశంసలు...



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 21 (ఆకాంక్ష) : దేశ రాజధాని న్యూ ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్‌లో పాల్గొని రాష్ట్రానికి గౌరవం తీసుకు వచ్చిన నాగర్ కర్నూల్ జిల్లా పాలెం గ్రామానికి చెందిన యువ విద్యార్థి డాక్టర్ భీమ్ భరత్‌కు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రశంసల వర్షం కురిపించారు. జిల్లాలోని పాలెం గ్రామానికి చెందిన అడ్వకేట్ బోనాసి రామచందర్ కుమారుడైన భరత్, ప్రస్తుతం వరంగల్‌లోని ఆర్‌వీఎం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. చిన్నప్పటి నుంచే దేశభక్తి, జాతీయ చైతన్యం పట్ల ఆసక్తి కలిగిన ఆయన, గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొనాలనే సంకల్పంతో కృషి చేసి, స్వతహాగా ఎంపిక కావడం విశేషం. జనవరి 26న జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక పరేడ్‌లో తెలంగాణ నుంచి ఒక్కరే ఎంపికై పాల్గొనడం ద్వారా రాష్ట్రానికి గౌరవం తీసుకువచ్చిన భరత్, పరేడ్ అనంతరం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకుని ఆమె ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల శనివారం రోజున గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపు మేరకు రాజ్ భవన్‌లో భరత్‌ను ఆహ్వానించి, ఆయన సాధించిన విజయాన్ని ప్రశంసించారు. ఎలాంటి ప్రత్యేక సహాయం లేకుండా స్వయంకృషితో మెడిసిన్ చదువుకుంటూ జాతీయస్థాయి వేడుకల్లో పాల్గొని తెలంగాణకు గుర్తింపు తీసుకురావడం గొప్ప విషయం అని గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా భరత్‌ను శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర గవర్నర్ చేత సత్కారం అందుకున్న భీమ్ భరత్‌కు ఆయన సహవిద్యార్థులు, అధ్యాపకులు, పాలెం గ్రామ ప్రజలు, మేధావులు, విద్యావేత్తలు, యువజన సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ విజయం ద్వారా నాగర్ కర్నూల్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి దేశవ్యాప్తంగా గౌరవం చేకూరిందని స్థానికులు గర్వంగా పేర్కొన్నారు.

### అంగన్వాడీల హక్కుల కోసం పోరాట ఘంటికలు....

### 23 నుండి ఎమ్మార్వో కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు...



వెల్దుర్తి//ఫిబ్రవరి 21 (ఆకాంక్ష) : అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మరోసారి పోరాట పంథాను ఎంచుకున్నారు. కనీస వేతనంగా రూ.26,000 చెల్లించాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, సమ్మె సమయంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23 నుండి 27వ తేదీ వరకు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈ దీక్షలు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వెల్దుర్తి ప్రాజెక్ట్ కార్యాలయంలో సీడీపీఓ లుక్, సూపర్వైజర్ పద్మావతి కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జె. లలితమ్మ, కర్నూలు జిల్లా అధ్యక్షురాలు చాందిని, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బి. మాధవస్వామి, అంగన్వాడి కార్యకర్తలు ఈదమ్మ, విజయ్ కుమారి, ఎఫ్సిబా, సుమలత, సరస్వతి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీల సేవలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు వెన్నెముక వంటివని, అయితే వారికి తగిన గుర్తింపు, గౌరవ వేతనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకలు...



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 21 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ & కామర్స్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యుడు ముచ్చర్ల దినకర్, క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకులు వాస రాఘవేందర్ హాజరయ్యారు. స్థానిక ప్రముఖులు బాస వెంకటేశ్వర్లు, మురళీధర్ రావు, అలాగే క్లాస్మేట్ క్లబ్ ప్రతినిధులు నవీన్, సి. సతీష్ పాల్గొని కార్యక్రమాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాతృభాష ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా కవితాగానం, పాటలు, వ్యాసరచన వంటి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు కొర్ర సంధ్య, ప్రవీణ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. గీతాంజలి అధ్యక్షతన జరిగిన సభలో మాతృభాష పరిరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. సభలో మాట్లాడిన ప్రిన్సిపల్ డాక్టర్ కె. గీతాంజలి మాతృభాషను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భాష వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. ముఖ్య అతిథి ముచ్చర్ల దినకర్ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున భాషా, సాంస్కృతిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని, అందరికీ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. వాస రాఘవేందర్ మాట్లాడుతూ తెలుగు మీడియం విద్యార్థులకు క్లాస్మేట్ క్లబ్ తరపున నిరంతరం అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ధర్మ హాజీరా, అధ్యాపకులు కృష్ణయ్య, మల్లేష్, సుధాకర్, మౌనిక, రిజ్వాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, మాతృభాషపై చూపిన అభిమానం సభను ఆకట్టుకున్నాయి. కార్యక్రమం చివర్లో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ వేడుకలను విజయవంతంగా ముగించారు.

## ఆర్థిక కష్టాల్లోనూ సంక్షేమానికి పెద్దపీట...

### అర్హులందరికీ పారదర్శకంగా ఫలాలు అందిస్తాం....

### మంత్రి జూపల్లి కృష్ణారావు...



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 21 (ఆకాంక్ష) : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పారదర్శకంగా సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సంక్షేమ పథకాల ఎంపికలో ఎవరైనా డబ్బులు అడిగితే సహించేది లేదని, నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని ఆయన స్పష్టం చేశారు. శనివారం కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజక వర్గానికి చెందిన 180 మంది లబ్ధిదారులకు రూ.1.81 కోట్ల విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ఆడపిల్లల పెళ్లిళ్లలో ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో మితిమీరిన అప్పుల కారణంగా తులం బంగారం ఇవ్వలేకపోతున్నామని, అయినప్పటికీ అందరికీ సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమం రంగాల్లో అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని వివరించారు. మహిళలకు ప్రాధాన్యతనిస్తూ ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, రూ.500కే గ్యాస్ సిలిండర్, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి ఇంటికి ఇల్లాలు వెలుగుగా మారేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పథకాన్ని అమలు చేస్తున్నామని, అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు అందజేస్తూ నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని చెప్పారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఉచిత విద్యుత్, సాగునీరు, పెట్టుబడి సహాయం, మద్దతు ధర వంటి సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## పెద్దపల్లి జిల్లా గూడెం గ్రామంలో ప్రజా బాట కార్యక్రమం...

విద్యుత్ సమస్యలపై గ్రామస్తుల వినతులు...




ఓదెల/ఫిబ్రవరి 21 ఆకాంక్ష : పెద్దపల్లి జిల్లా ఓదెల మండల పరిధిలోని గూడెం గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా బాట కార్యక్రమం శనివారం గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్, లైన్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున్ హాజరై గ్రామ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిట్ల రామ్, గ్రామ పాలకవర్గ సభ్యులు గ్రామంలో నెలకొన్న పలు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గ్రామంలో తరచుగా జరుగుతున్న విద్యుత్ అంతరాయాలు, లో వోల్టేజ్ సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వివరించారు. అదే విధంగా పాడైపోయిన విద్యుత్ స్తంభాలు, చెడిపోయిన వైర్లు, లైన్ల మరమ్మతులు తక్షణం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గ్రామ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఇళ్లకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లు, మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్ లోపాలు, రాత్రివేళల్లో వెలుతురు సమస్యలు వంటి అనేక అంశాలను అధికారుల ముందుంచారు. ప్రతి సమస్యను శ్రద్ధగా విన్న అధికారులు వాటిని నమోదు చేసుకొని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్ల రామ్, ఉపసర్పంచ్ బుడిగే కుమారస్వామి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రవి, విద్యుత్ శాఖ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు నిర్వహించిన ఈ ప్రజా బాట కార్యక్రమం గ్రామస్తుల్లో విశ్వాసాన్ని కలిగించిందని స్థానికులు తెలిపారు.

## మార్చి 31లోగా దేశంలో నక్సలిజం అంతం మంత్రి అమిత్ షా..



గౌహతి/ఫిబ్రవరి 21 ఆకాంక్ష : మార్చి 31 లోగా దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించనున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. 87వ సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ దళాలు కీలక పాత్ర పోషించినట్లు ఆయన చెప్పారు. అక్కడ రాళ్లు రువ్వే ఘటనలు సున్నాకు పడిపోయినట్లు వెల్లడించారు. మణిపూర్‌లోనూ వర్గ హింసను ఆ దళాలు కట్టడి చేసినట్లు చెప్పారు. కేవలం మూడేళ్లలో మావోయిస్టుల వెన్ను విరిచినట్లు సీఆర్పీఎఫ్‌ను మంత్రి షా కీర్తించారు. సీఆర్పీఎఫ్‌పై నమ్మకంతో కాన్ఫిడెంట్‌గా చెబుతున్నానని, దేశంలో 2026 మార్చి 31వ తేదీ వరకు నక్సల్ సమస్యను నిర్మూలించనున్నట్లు షా తెలిపారు.చత్తీస్‌ఘడ్-తెలంగాణ బోర్డర్‌లో ఉన్న కర్రెగుట్టలో ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌ను చేపట్టిన దళాలపై మంత్రి షా ప్రశంసలు కురిపించారు. ఆ ఆపరేషన్‌లో గత ఏడాది ఏప్రిల్, మే మధ్య కాలంలో 31 మంది నక్సల్స్ మరణించారు. సుమారు 46 డిగ్రీల ఎండలో ఆ ఆపరేషన్ చేపట్టినట్లు చెప్పారు. నక్సల్స్ ఆధీనంలో ఉన్న ఆ కొండల్ని విముక్తి చేసేందుకు కేంద్ర రిజర్వ్ పోలీసులు దళాలు అత్యంత ధైర్యాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. పదేళ్ల క్రితం దేశంలో మూడు అతిపెద్ద హాట్‌స్పాట్ కేంద్రాలు ఉండేవని, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం,ఈశాన్యంలో చొరబాటులు, చత్తీస్‌ఘడ్ అడవుల్లో నక్సలిజం పెద్ద సమస్యగా ఉండేవని, కానీ ఇప్పుడు ఆ ప్రాంతాలు ప్రగతి, శాంతికి సంకేతంగా మారాయన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో 700 మంది సీఆర్పీఎఫ్, నక్సల్ ప్రాంతాల్లో 780 మంది, జమ్మూకశ్మీర్‌లో 540 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు మంత్రి వెల్లడించారు. వీరి త్యాగాల వల్ల ఒకప్పుడు హింసకు కేంద్ర బిందువులైన ఆ ప్రాంతాలు ఇప్పుడు శాంతియుతంగా మారాయన్నారు.

## పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ఊరట....



భివాండీ//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కి ఊరట లభించింది. మహారాష్ట్ర లోని భివాండీ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. మహాత్మాగాంధీ హత్య వెనుక ఆరెస్సెస్ హస్తం ఉందని 2014లో రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఆరెస్సెస్ కేసు వేసింది.మహారాష్ట్రలోని భివాండీ కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. ఇవాళ జరిగిన విచారణకు రాహుల్‌గాంధీ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ క్రమంలో న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రలోని సోనాలే గ్రామంలో జరిగిన ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. అక్కడ ఆయన మాట్లాడుతూ.. ఆరెస్సెస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు.మహాత్మాగాంధీ హత్య వెనుక సంఘ్ హస్తం ఉందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. దాంతో రాహుల్ వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొంటూ.. అప్పట్లో సంఘ్ కార్యకర్త రాజేష్ కుంటే మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదుచేశారు. ఆ కేసు విచారణలో ఇప్పుడు రాహుల్‌గాంధీకి బెయిల్ మంజూరయ్యింది.

## యుఎస్ఏ సుప్రీంకోర్టు తీర్పును తప్పుబట్టిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్...



న్యూయార్క్//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : యుఎస్ఏ సుప్రీంకోర్టు తీర్పును అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తప్పుబట్టాడు. సుప్రీం నిర్ణయం దేశానికే అవమానకరమని, సుప్రీంకోర్టు జడ్జిలని చూసి సిగ్గుపడుతున్నానని, జడ్జిల తీర్పు తీవ్రంగా నిరాశపర్చిందని దుయ్యబట్టారు. ట్రంప్ విధించిన సుంకాలు చెల్లబోవు అని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన సందర్భంగా డోనాల్డ్ ట్రంప్ మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు జడ్జిలు విదేశీ ప్రభావానికి లోనయ్యారని, ఎట్టి పరిస్థితుల్లో టారిఫ్ విషయంలో వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ట్రంప్ సుంకాల వ్యతిరేకించిన వారిలో ఆరుగురు జడ్జిల్లో నలుగురు మహిళలు అమీకోనీ బారెట్, సోనియా సోటోమేయర్, ఎలెనా కగన్, కేతాంజీ బ్రౌన్ జాక్సన్, ఇద్దరు పురుషులు జాన్ రాబర్ట్స్, నీల్ గోర్సుచ్ ఉన్నారని తెలియజేశారు. ట్రంప్ సుంకాలను సమర్థించిన ముగ్గురు జడ్జిల్లో క్లారెన్స్ థామస్, బ్రెట్ కవనాఫ్, శామ్యూల్ అలిటో ఉన్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత 10 శాతం గ్లోబల్ టారిఫ్ ఆర్డర్స్ పై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ఆయనకు అత్యంత ఇష్టమైన పదం టారిఫ్ అని ప్రకటించుకోవడమే కాకుండా... ఎడాపెడా సుంకాలు వేస్తూ ప్రపంచ దేశాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా తన దారి కి తెచ్చుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారీ షాక్ తగిలిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ట్రంప్ విధించిన సుంకాలు చెల్లబోవు అని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆయా దేశాల వద్ద నుంచి వసూలు చేసిన అదనపు సుంకాలను తిరిగి వారికి చెల్లించాలని స్పష్టం చేసింది. ట్రం ప్ తన అధికారాలను అతిక్రమించారని మొట్టికాయలు వేసింది. దేశ వాణిజ్య భాగస్వాముల పై సుంకాలు విధించడం చట్ట విరుద్ధమని, అధికార పరిధిని మించిపోవడమేనని ఘాటైన వ్యా ఖ్యలు చేసింది. ఏకపక్షంగా సుంకాలు విధించడాన్ని న్యాయస్థానం తప్పుపట్టింది. జాతీయ అ త్యవసర పరిస్థితుల్లో ఉపయోగించాల్సిన అత్యవసర వినియోగాల చట్టాన్ని అతిక్రమించారని అభిప్రాయపడింది. శుక్రవారంనాడు అమెరికా సుప్రీంకోర్టు ధర్మాసనం 6-3 తేడాతో ఈ చరిత్రాత్మక తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే.

## ఎఐ అనే మాటను వింటేనే వణుకు పుడుతోంది....

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు...



అమరావతి/ఫిబ్రవరి 21 ఆకాంక్ష : ఎఐ అనే మాటను వింటేనే వణుకు పుడుతోందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలిపారు. ఎఐతో మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోనని భయమేస్తోందని అన్నారు. ఎఐపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విద్వేషాలు రెచ్చగొట్టకుండా.. ఎఐని కట్టడి చేయాలని, విలువలతో కూడిన కృత్రిమ మేథస్సు అందించాలని నిపుణులను కోరారు. ఎఐతో వైట్ కాలర్ జాబ్స్ పోకుండా మార్గాలు అన్వేషించాలని వెంకయ్యనాయుడు సూచించారు. సోషల్ మీడియాలో నేతలు భాషను అసహ్యంగా వాడుతున్నారని, వినేందుకు కూడా వీలు లేని పదాలను నీచంగా ఉపయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ మేధస్సుతోనే మంచి ఫలితాలు ఉంటాయని, కృత్రిమ మేధస్సు కృత్రిమంగా ఉంటుందని, ఎఐ విస్తృతం అయితే.. వినియోగంలో అనర్థాలపై అవగాహన అవసరం ఉందని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

# కుమ్మెర మల్లన్న జాతరలో అమానుష ఘటన..

బీసీ కుటుంబంపై దాడి, చిన్నారి మృతి...

కులం పేరుతో ఆలయ ప్రవేశం నిరాకరణ...

ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన బాధితులకే

బెదిరింపులకు గురి చేసినట్లు పోలీసులపై

ఆరోపణలు...



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : నాగర్ కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామంలో జరుగుతున్న ప్రసిద్ధ మల్లన్న జాతరలో శనివారం అమానుష ఘటన చోటుచేసుకుంది. దేవుడి దర్శనం కోసం వచ్చిన బీసీ కుటుంబాన్ని కులం పేరుతో ఆలయంలోకి అనుమతించకుండా అడ్డుకోవడమే కాకుండా, ప్రశ్నించినందుకు వారిపై దాడి జరగడం స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రెండు నెలల చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందడం మరింత విషాదాన్ని మిగిల్చింది. స్థానికుల కథనం ప్రకారం, నాగర్ కర్నూల్ మండలం పరిధిలోని కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా చాకలి చంద్రకళ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వెళ్లింది. ఆలయంలోకి ప్రవేశించబోతుండగా, జాతర నిర్వాహకులు మరియు గ్రామంలోని కొందరు ప్రభావశీలులు కలిసి వారిని అడ్డుకున్నారు. తక్కువ జాతికి చెందినవారమని చెప్పి గుడిలోకి అనుమతించబోమని తెలిపారు.దేవుడి దర్శనం అందరికీ సమానమని, తమను ఎందుకు అడ్డుకుంటున్నారని చంద్రకళ కుటుంబ సభ్యులు ప్రశ్నించగా, నిర్వాహకులు తీవ్ర ఆగ్రహంతో వారిపై దాడికి దిగినట్లు సమాచారం. చంద్రకళతో పాటు ఆమె కొడుకు గణేష్, కోడలు, కూతురు పై దారుణంగా దాడి చేసి, బూతులు తిట్టి, తోసిపుచ్చినట్లు బాధితులు పేర్కొన్నారు.ఈసమయంలో రెండు నెలల చిన్నారి కూడా వారి వెంట ఉండగా, కుటుంబ సభ్యులు చిన్నారి ఉన్న విషయం చెప్పి కనీసం ఆమెను చూసైనా తమను వదిలేయమని వేడుకున్నా నిర్వాహకులు కనికరం చూపలేదని ఆరోపించారు. దాడి సమయంలో చిన్నారిని కాలితో తన్నడంతో తీవ్ర గాయాలు కావడంతో, వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు.ఈ ఘటనపై ఫిర్యాదు చేయడానికి నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన బాధితులకు అక్కడ కూడా ఇబ్బందులు ఎదురయ్యాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నిర్వాహకులు రాజకీయ ప్రభావం కలిగిన అగ్రకుల వ్యక్తులు కావడంతో, తమ ఫిర్యాదును పోలీసులు నమోదు చేయడం లేదని, తిరిగి తమనే బెదిరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.ఈఘటనపై సమాచారం తెలిసిన వెంటనే స్థానిక ప్రజాసంఘాలు, సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుల వివక్ష పేరుతో దేవాలయ ప్రవేశం నిరాకరించడం, మహిళలు మరియు చిన్నారిపై దాడి చేయడం వంటి చర్యలు తీవ్రంగా ఖండించాల్సినవని వారు పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో అదనపు పోలీసు బలగాలను మోహరించినట్లు సమాచారం. ఘటనపై జిల్లా అధికారులు దృష్టి సారించి విచారణ చేపట్టాలని, చిన్నారి మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.ఇదిలా ఉండగా, ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. దేవాలయ ప్రవేశం విషయంలో కుల వివక్ష ఇంకా కొనసాగుతుండడం పట్ల సామాజిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం, రక్షణ కల్పించాలని, ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# బాలికలకు శాపం.. ముందస్తు రుతుక్రమం..

ముందుతరం వారితో పోలిస్తే ఐదేళ్ల వ్యత్యాసం..


వాతావరణంలో మార్పులు...

పోషకాహార లేమి తో చిన్న వయస్సులో

రుతుక్రమం...

హైదరాబాద్/ఫిబ్రవరి 21 ఆకాంక్ష : ఆడపిల్ల జీవితంలో 'రుతుక్రమం (రజస్వల)కీలకమైన ఘట్టం. శారీరకంగా, మానసికంగా పలుమార్పులు చోటుచేసుకునే సహజ సందర్భం. హార్మోన్ల స్థాయిల్లో హెచ్చు తగ్గులవల్ల కలిగే ఈ ప్రక్రియ, సాధారణంగా 13 15 ఏళ్ల వయస్సుమధ్యలో చోటు చేసుకుంటుంది. యవ్వనంలోకి అడుగిడుతున్న ఆడపిల్లలో రుతుక్రమం మొదలవుతుంది. ఈస్ట్రోజన్, ప్రొజెస్టెరాన్ హార్మోన్ల మార్పుల వల్ల అండాశయంనుంచి అండం విడుదలకావడంతో ఈ ప్రక్రియ ఆరంభమవుతుంది. ఇది స్త్రీ పునరుత్పత్తి ఆరోగ్యానికి, శారీరక ఎదుగుదలకు, గర్భధారణ సామర్థ్యానికి సంకేతంలా నిలుస్తుంది. కానీ, వాతావరణంలో మార్పులు, పోషకాహార లేమి తదితర కారణాల వల్ల చిన్న వయస్సులోనే రుతుక్రమం గురవుతున్న బాలికల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీంతో పిల్లలతోపాటు తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారు. ఎదిగీఎదగని వయస్సు, ఆడుతూపాడుతూ గడిపే కాలం, ప్రాథమిక తరగతి చదువుతున్న క్రమంలో (అంటే 9..11 ఏళ్ల వయస్సు) రుతుక్రమం (ఎర్లియర్లీ మెచ్యూర్) చోటుచేసుకుంటోంది. ఆహారపు అలవాట్లు మారడం, అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్ అధికంగా తీసుకోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం, తీసుకునే ఆహారంలో ఐరన్ లోపించడం, బాడీ మాస్ ఇండెక్స్(బిఎంఐ) అనూహ్యంగా పెరిగి హార్మోన్ల సమతుల్యత దెబ్బతినడంతో చిన్నవయస్సులోనే రుతుక్రమం చోటుచేసుకుంటోంది. హోమ్ అప్లయెన్సెస్ ఊహతెలియని వయస్సులో పిరియడ్ సైకిల్ ప్రారంభం కావడంతో తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. చిన్నారులకు అవగాహన కల్పించినా ఏమేరకు నెట్టుకురాగలుగుతారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాస్తవానికి, రుతుక్రమం యవ్వనానికి చేరువవుతోన్న అమ్మాయిల్లో శారీరకంగా, మానసికంగా పలు మార్పులు రావడం సహజం. హార్మోన్ల స్థాయిలో హెచ్చుతగ్గులవల్ల వచ్చే ఈ మార్పులు టీనేజ్ దశలో ప్రవేశించి అమ్మాయిలకు అసౌకర్యం, ఇబ్బందిని కలుగజేస్తున్నాయి. పైగా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముంది. ముఖ్యంగా మెటబాలిక్ సిండ్రోమ్, టైప్2 మధుమేహం, హైపర్ టెన్షన్ వంటి సమస్యలు వచ్చే అవకాశముంది. రుతుక్రమం అయిన తొలి ఐదారేళ్ల వరకు నాణ్యమైన అండాలు ఉత్పత్తి అయినప్పటికీ, చివరి పదేళ్లలో అండాల ఉత్పత్తిలో నాణ్యత తగ్గడం, ఆలస్యంగా వివాహం చేసుకోవడం వల్ల సంతానోత్పత్తి తగ్గుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రతి బాలిక తన జీవితకాలంలో ఒక నిర్దిష్ట వయస్సులో రుతుక్రమం కావడం జరుగుతుంది. కొంతమందిలో పన్నెండేళ్ల వయస్సు దాటినప్పటికీ రుతుక్రమం కోసం ఎదురుచూస్తుంటారు. గతంలో పదహారేళ్ల వయస్సులో రుతుక్రమం అయ్యేది. తర్వాత కాలంలో చాలా మంది అమ్మాయిలు 12 15 ఏళ్ల వయస్సులో రుతుక్రమం జరుగుతుండేది. ప్రస్తుత కాలంలో బాలికలు తమ మొదటి పీరియడ్‌ను చాలా ముందుగానే పొందుతున్నారు. ముందుతరం వారితో పోలిస్తే ఐదేళ్ల వ్యత్యాసముంటోంది. సాధారణంగా బాల్యం చివరి దశలో ప్రారంభమయ్యే ప్రక్రియ ఇది. యుక్త వయస్సు రావడానికి ముందు హైపోథలమస్, పిట్యూటరీ, అండాశయాలు పరిపక్వ స్థితికి చేరుకుంటాయి. పదేళ్ల వయస్సులో మొదలైన ప్రక్రియ రెండు మూడేళ్లు కొనసాగి అప్పుడు రుతుక్రమంకు దారితీసేది. ప్రస్తుతం ఇందుకు భిన్నంగా పదేళ్ల కన్నా తక్కువ వయస్సులో రుతుక్రమం రావడం అసాధారణ సందర్భంగానే వైద్యులు పేర్కొంటున్నారు.చిన్న వయస్సులో రుతుక్రమం రావడానికి దారితీస్తున్న పరిస్థితులపై ప్రపంచవ్యాప్తంగా పలు పరిశోధనలు జరుగుతున్నాయి. ఆర్థిక నేపథ్యం నుంచి ప్రతి అంశం వారిని ప్రభావితం చేస్తున్నట్లు గుర్తించారు. కొంతమంది బాలికలు ఐదేళ్ల వయస్సులోనే రుతుక్రమంకు గురవుతున్నట్లు తేలింది. ఇందుకు ఆర్థిక అంశాలు మాత్రమే కాకుండా శారీరక అంశాలు, వాతావరణ పరిస్థితులు, పుట్టిన శిశువు తీసుకునే మందులు ప్రభావితం చేస్తున్నట్లు తేల్చారు. యాంటీబయోటిక్స్ ఒక కారణంగా దక్షిణ కొరియాలో జరిగిన ఓ అధ్యయనం తెలియజేస్తోంది. రెండు లక్షలమంది ఆడపిల్లలపై జరిపిన ఈ అధ్యయనం.. పుట్టిన పిల్లల దగ్గర్నుంచీ తొమ్మిదేళ్ల వయస్సు వరకూ గమనించారు. పుట్టిన తొలి మూడు నెలల్లో యాంటీబయోటిక్స్ తీసుకున్న ఆడశిశువుల్లో 22% మంది ఎనిమిదేళ్లకంటే ముందుగానే రుతుక్రమం అవుతున్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితిని సిపిపి (సెంట్రల్ ప్రికాషియస్ ప్యుబర్టీ) అంటారు. పుట్టిన తొలి రెండు వారాల్లో యాంటీ బయోటిక్స్ ఇస్తే ఈ సమస్య తీవ్రంగా ఉంటుందంటున్నారు. శరీరంలోకి చేరిన యాంటీ బయోటిక్స్ ఆడపిల్లల హార్మోన్ల వ్యవస్థని అదుపు తప్పేలా చేయడం వల్లనే త్వరగా రుతుక్రమం అవుతుందని ఈ అధ్యయనం తెలియజేస్తున్నది. అధిక బరువు, ఊబకాయం, శారీరక శ్రమ తక్కువగా ఉండడం కారణమవుతున్నాయి. మొబైల్, టివిలను ఎక్కువ సమయం వీక్షించే బాలికల్లో యుక్తవయస్సు త్వరగా ప్రారంభమవుతుందని, ఇవి తమ మొదటి పీరియడ్స్‌ను ప్రేరేపిస్తుందని వివరించారు. బాలికల్లో ఎర్లీ పీరియడ్స్‌కు పరిసర ప్రాంతాలు కూడా ఓ కారణంగా నిలుస్తుందని పరిశోధకులు తెలియజేస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా 70 శాతానికిపైగా ఆడపిల్లలకు 'రుతుక్రమం' విషయం తెలియదనే చెప్పాలి. ఒకసారి పీరియడ్స్ ప్రారంభమవుతే, శారీరక పరిశుభ్రత చాలా అవసరం. ఈ విషయంలో కూతురితో మాట్లాడటానికి తల్లి చొరవచూపాలి. జరిగే పరిణామాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కూలంకషంగా చర్చించాలి. తీసుకునే ఆహారం విషయంలో పోషకాలకు చోటివ్వడం, ఆత్మనూన్యతకు గురికాకుండా అప్రమత్తం చేయడం తల్లిపాత్ర కీలకంగా ఉంటుంది. శరీర నిర్మాణం, రుతుచక్రం రావడం గురించి విపులంగా వివరించాలి. ఇదిలా వుండగా, ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కీలకమైంది. ద్విసభ్య ధర్మాసనం వెలువరించిన ఆదేశాల ప్రకారం విద్యార్థినుల నెలసరి ఆరోగ్య సమస్యను భారత రాజ్యాంగంలోని జీవించే హక్కులో భాగమని విశ్లేషించింది. నెలసరి నిర్వహణ వారి విద్యార్జన సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తే, అది వారి విద్యాహక్కునూ, వారికి గల గౌరవప్రదమైన జీవించే హక్కునూ ప్రభావితం చేసినట్లేనని పేర్కొంది. కాబట్టి, ఆడపిల్లల ఆర్యోగాన్ని పరిరక్షించే విధానాలు ప్రభుత్వాలు చేపట్టడం అత్యంత ఆవశ్యకతగా పేర్కొంది.

## అయిజలో అగ్నిప్రమాదం.. భారీగా ఆస్తి నష్టం...



గద్వాలఫిబ్రవరి 21 ఆకాంక్ష : జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజలో అగ్నిప్రమాదం జరిగింది. అయిజలోని ఓ ప్రైవేటు కంపెనీలో భారీగా మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగసిపడుతుండటంతో స్థానికులు భయంతో వణికిపోయారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమని అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం. ప్రాణ నష్టం గురించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు సరికొత్త వ్యూహం...

క్రియేటర్లు సామాజిక బాధ్యతగా ముందుకు రావాలి...

జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్....

హైదరాబాద్' క్యాంపెయిన్‌లో నగర సిపి సజ్జనార్ పిలుపు...

హైదరాబాద్//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ



పోలీసులు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. కేవలం అధికారిక హెచ్చరికలకే పరిమితం కాకుండా, సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యే రీతిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్, ఐపిఎస్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్న 'జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ నూతన విధానానికి విశేష స్పందన లభిస్తోంది. పోలీసుల పిలుపు మేరకు పలువురు ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సైబర్ నేరాల తీరుతెన్నులను వివరిస్తూ తమదైన శైలిలో వీడియోలు రూపొందిస్తున్నారు. వీటిని హైదరాబాద్ సిటీ పోలీస్, సిపి విసి సజ్జనార్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలతో 'కొలాబరేట్' చేయడం ద్వారా లక్షలాది మందికి చేరువ చేస్తున్నారు. వినోదాత్మకంగా ఉంటూనే, అత్యంత కీలకమైన సైబర్ భద్రతా సూచనలను ఈ వీడియోలు ప్రజలకు అందిస్తున్నాయి.

## దాడులకు లష్కరే తొయిబా ప్లానింగ్....

ఢిల్లీలో హై అలర్ట్.. భద్రత కట్టుదిట్టం...



న్యూఢిల్లీ/ఫిబ్రవరి 21 ఆకాంక్ష : దేశ రాజధాని ఢిల్లీలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. అలాగే ప్రధాన దేవాలయాల్లోనూ అలర్ట్ కొనసాగుతోంది. దీనిలో భాగంగా అనేక చోట్ల భద్రతను కట్టుదిట్టం చేశారు. దేశ రాజధాని ఢిల్లీతోపాటు పలు దేవాలయాలపై పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తొయిబా అనే తీవ్రవాద సంస్థ దాడులకు కుట్ర పన్నిందని ఇంటెలిజెన్స్ హెచ్చరించిన సంగతి తెలిసిందే.ఢిల్లీతోపాటు ప్రముఖ నగరాలు, ప్రధాన దేవాలయాలు వంటి రద్దీ ప్రదేశాల్ని లష్కరే తొయిబా సంస్థ టార్గెట్ చేసుకున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ముఖ్యంగా ఢిల్లీలోని చారిత్రక ప్రదేశాలైన ఎర్రకోట, చాందినీ చౌక్, పరిసర దేవాలయాల్లో ఐఈడీలతో పేలుడుకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు భద్రతను మరింత పెంచి హై అలర్ట్ ప్రకటించారు. అన్ని స్థాయిల్లో భద్రతను 24 గంటలు పర్యవేక్షించేలా పార్లమెంటరీ బృందాలు పని చేస్తున్నాయి. ఇటీవల పాకిస్తాన్‌లో మసీదు వద్ద మానవ బాంబు దాడిలో పలువురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు పాకిస్తాన్ ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. దీనిలో భాగంగా పాక్‌కు చెందిన ఉగ్రసంస్థ లష్కరే తొయిబా ఇండియాలో పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు రహస్య సమాచారం అందింది.దేశంలోని ప్రధాన దేవాలయాల్ని కూడా ఈ ఉగ్రసంస్థ టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. అందుకే ఆయా ప్రాంతాల్లో పోలీసులు, భద్రతా సిబ్బందిని భారీ సంఖ్యలో మోహరించారు. లష్కరే తొయిబా సంస్థకు మోస్ట్ వాంటెడ్ టెర్రిస్ట్ అయిన హఫీజ్ సయీద్ నాయకత్వం వహిస్తున్నాడు. గత ఏడాది నవంబర్ 25న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కార్ బాంబ్ బ్లాస్ట్ అయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 12 మంది మరణించగా, 20 మందికిపైగా గాయపడ్డారు.

## కాంగ్రెస్ నాయకుల రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి నైతిక దాడులు..

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆగ్రహం...



హైదరాబాద్//ఫిబ్రవరి 21 ఆకాంక్ష : కామారెడ్డిలో కాటిపల్లి వెంకట రమణారెడ్డి గారి క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో చర్చకు స్థానం ఉండాలి గానీ, హింసకు కాదు. కాంగ్రెస్ నాయకుల రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఈ విధమైన అల్లర్లకు పాల్పడటం అత్యంత దుర్మార్గం. శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కామారెడ్డిలో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే బిజెపి సహించదని హెచ్చరించారు.ఇలాంటి రాజకీయ హింసాత్మక చర్యలకు ప్రజాస్వామ్యంలో ఏమాత్రం స్థానం లేదు. మా పార్టీ కార్యకర్తలకు అండగా నిలవడం కోసం, అలాగే పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి నిజాలు ప్రజల ముందుకు తీసుకురావడం కోసం నేను స్వయంగా సంఘటన స్థలాన్ని సందర్శిస్తాను. హింసను ప్రోత్సహించే రాజకీయాలను భారతీయ జనతా పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని పేర్కొన్నారు.